PRAMUKHANDHRA 26th Year of Publication We carry the news and views of Telugus

26 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర




వ్యవస్థాపకులు
శ్రీ గోపేటి శ్రీ రామారావు

₹.15
అక్టోబర్ 2020



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA,
GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA


అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే
అఆ
310 నెలలుగా
310 సంచికలను
శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।
ప్రముఖాంధ్ర
- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!
'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)
గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు
చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

అక్టోబరు 2020

సంపుటి : 26 **309** సంచిక : 10




# మనిషి మనిషిగా కలిసిమెలిసి బ్రతకాలి!

మనిషికి అలవికానిదేఁవీ లేదు. చంద్రమండలం మీదకు కూడా మనిషి వెళ్లాడు. తన జెండా నెగురవేశాడు.

**సకలవిద్యలు నేర్చి సభ జయించగవచ్చు**
**శూరుడై జగమందు పోరవచ్చు**
**రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు**
**హేమ గోదానంబు లీయవచ్చు**
**గగనమందు చుక్కలు పెంచగా వచ్చు**
**జీవరాశుల పేర్లు చెప్పవచ్చు**
**అష్టాంగవిద్యలన్ని అభ్యసించగవచ్చు**
**చంద్రమండలమైన చేరవచ్చు**
**కాని – దేహేంద్రియముల నరిగట్టి**
**మనసు నిలిపి అంతర్ముఖము చేసి**
**అనవరతము నిశ్చల మానవతా విలువలు నిలుపలేరు –**

– అన్నారు సత్యసాయిబాబావారు.

ఇది నూటికీ నూరుపాళ్ల నిజం. మానవుడు చంద్రమండలం మీదకు వెళ్లాడు. అంగారక గ్రహమ్మీదకు వెళ్లాలనుకుంటున్నాడు. వీలైతే అక్కడ కూడా ఇళ్లు కట్టుకోవాలనుకుంటున్నాడు. రాక్షసులూ, దేవతలూ, గంధర్వులూ, యక్షిణులూ పూర్వం చేసిన విద్యయే ఇది. కానీ – మనిషి మానవతా విలువల్ని మరిచిపోతున్నాడు. మనిషిని మనిషి దోచుకొనే విధానాన్ని అవలంబిస్తున్నాడు.

గుణవంతులైన యువకులు తయారుకాకపోవడం, పెద్దలు నీతి తప్పిన వృద్ధ జంబూకాలు కావడమే. ముఖ్యంగా రాజకీయాల్లోనూ, అధికార వర్గంలోనూ అహేతువర్తనా కార్యకర్తలుగా అనునిత్యమూ పెరుగుతూండడమొక కారణం. ఒక్కొక్క ఉద్యోగి కోట్లకు కోట్లు సంపాదిస్తున్నాడంటే ఎక్కడిదీ ధనం?

ఉప్పు మీద పన్ను వేశారని గాంధీగారు ఉప్పు సత్యాగ్రహం చేశారు. అదే కాంగ్రెస్‌వాదీ, గాంధేయుడనిపించుకునేవాడు, పప్పు, ధాన్యములు మీద పన్ను వేస్తున్నాడు. ఆఖరికి హోటల్లో తినే పదార్థముల మీద కూడా పన్ను చెల్లించాల్సి వస్తున్నది. అంతరిక్షం స్థాయికి ధరవరులు ఎగసిబోతుంటే ఒక్కడంటే ఒక్క నాయకుడు నోరు మెదపడు. ఇదేఁవైనా విదేశాల్నుంచీ దిగుమతి కావల్సిన వస్తువా, విదేశీయుని కుట్రయా! స్వదేశీయుని కుటిల హస్తం, కుటిలయత్నం. కొరడా పట్టలేని ప్రభుత్వ అసమర్థత. సద్విమర్శలు చేసే ప్రతిపక్షాలు లేవు – అందరూ ప్రతికక్షులే! పొత్తు అవసరాలు వచ్చినప్పుడు ఓడమల్లయ్యలవుతున్నారు; పొత్తు తీరినప్పుడో, పొత్తు కలుగనప్పుడో బోడిమల్లయ్యలవుతున్నారు.

ఇందు మతాలూ, కులాలూ, ప్రాంతాల విషయానికొచ్చేసరికి భిన్నత్వమే! ఏకత్వమే కనుమరుగవుతూంది. మనిషి స్వరూపంలో ఒకడేగానీ, స్వభావంలో ఏకం కాలేకపోతున్నాడు. అందుకే ప్రపంచంలో శాన్తి కరువవుతూంది. వర్గ పోరాటం అధికమవుతూంది.

దీనికల్లా మూలహేతువు ఏదయ్యా అంటే – విద్య. విద్యగరిపే విజ్ఞానం. విజ్ఞానం వెర్రితలలు వేయడం బట్టే వేర్పాటు విధానం, హింస, క్షమారహితమైన, అనైక్యతా పేర్కొనిపోతుంది. దీన్ని నివారించాలంటే జ్ఞానకరమైన విద్య కావాలి. అది జన్మ ప్రసాదించిన ఇంట్లోనే, తల్లితండ్రుల నుంచే, ప్రారంభం కావాలి. అటు పిదప విద్యాలయాలు విజ్ఞాన నిలయాలు కావాలి. అందుకు తగిన సిలబస్సు రూపొందింపబడాలి. ఇవన్నీ ఎప్పుడు సిద్ధిస్తాయో అప్పుడే రాష్ట్రం, దేశం, విశ్వం శాన్తి సౌభాతృత్వాల నిలయమవుతుంది.



*బుధజన విధేయుడు*

***– గోటేటి శ్రీరామారావు***

**(డిసెంబర్ 2009, ప్రముఖాంధ్ర)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**





# తిరుమల విమాన వేంకటేశ్వరస్వామి

ఆనంద నిలయ విమానం మీద వాయవ్యమూలకు గూడులాంటి చిన్న మందిరం వెండి మకరతోరణంతో అలంకరింపబడింది. ఆ మందిరంలో ఏ వేంకటేశ్వరస్వామి వారి మూలమూర్తిని పోలిన చిన్న విగ్రహం ఉంది. ఆయనకు ఇరువైపులా గరుత్మంతుడు, హనుమంతుడు ఉంటూ సేవిస్తూ ఉన్నారు. ఆనంద నిలయ విమానంపై వేంచేసి ఉన్నందువల్ల ఆయన "విమాన వేంకటేశ్వరుడు"గా పిలువ బడుచున్నాడు.

ఈ విమాన వేంకటేశ్వరస్వామివారిని తొండమాన్ చక్రవర్తి ఏర్పాటు చేశాడని "వేంకటాచల మాహాత్మ్యం" ద్వారా తెలుస్తోంది. ఈ విమాన వేంకటేశ్వరస్వామి వారి దర్శనం గర్భాలయంలో స్వయంభూమూర్తిగా వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి మూలవిరాణ్మూర్తి దర్శనంతో సమానమని విశ్వాసం. ఒకవేళ ఆనందనిలయంలోని మూలమూర్తి దర్శనం కాకపోయినా ఈ విమాన వేంకటేశ్వరుని దర్శిస్తే చాలట యాత్రా ఫలితం దక్కుతుందట.

పూర్వం భక్తులు విమాన ప్రదక్షిణ చేస్తూ ముందుగా "విమాన వేంకటేశ్వర స్వామి" వారిని దర్శించిన తర్వాతే ఆనంద నిలయంలోని మూలమూర్తిని దర్శించేవారట. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ముందు ఏ మూలమూర్తిని దర్శించుకున్న తర్వాతే విమాన వేంకటేశ్వరస్వామివారిని దర్శించడం జరుగుతూ ఉంది. ఈ విమాన వేంకటేశ్వరస్వామివారిని దర్శించిన సర్వజీవుల పాపాలు తొలగుతాయి అంతేకాదు సర్వశుభాలు కలుగుతాయట.

ఆనందనిలయ విమానం మీద ఉన్న ఈ వేంకటేశ్వరస్వామివారు శ్రీ వ్యాస తీర్థుల వారి కాలం నుండి ప్రాధాన్యాన్ని విశిష్టతను సంతరించుకున్నాడు. శ్రీకృష్ణ దేవరాయలవారి కాలంలో ప్రసిద్ధి పొందిన ద్వైతపీఠ సంప్రద్రాయ ప్రవర్ధకులు ఈ వ్యాసతీర్థులు. కృష్ణదేవరాయలకు కలిగిన "కుహూ" యోగమనే కాలసర్ప దోషం నుండి కాపాడడానికి విజయనగర సింహాసనాన్ని తానే అధిష్ఠించినారట. అందువల్లే ఈ యతీశ్వరులకు "రాయలు" అనే బిరుద నామం ఏర్పడి "వ్యాసరాయలు"గా లోకంలో ప్రసిద్ధి పొందినారు. తదుపరి శ్రీవ్యాసరాయలు తిరుమల శ్రీవారి ఆలయంలో సుమారు 12 సంవత్సరాలపాటు అర్చనాధికములు నిర్వహించినారట. ఆ సమయంలో విమాన వేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో పారాయణలు, దర్శనాదులు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. అందువల్లే శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించిన తర్వాత విమాన ప్రదక్షిణమార్గంలో నడుస్తున్న భక్తులు ఈ విమాన వేంకటేశ్వరస్వామి వారిని దర్శించడం కూడ ప్రధాన ఘట్టంగా ఆలయ సంప్రదాయంలో స్థిరంగా నిలిచి ఉన్నది. ఇలా భక్తులు మాత్రమేకాదు చివరకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారు కూడ ఆలయం బయటకు వెళ్ళే ముందుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఈ విమాన వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో కాసేపు నిలబడి హారతులందుకుంటాడు.

ప్రతి సంవత్సరానికొకసారి మూడురోజులపాటు జరిగే పవిత్రోత్సవ సమయంలో విమాన వేంకటేశ్వరస్వామివారికి కూడా పవిత్ర మాలలు సమర్పింపబడతాయి. దీని కోసం అర్చకస్వాములు విమాన వేంకటేశ్వరస్వామి సన్నిధికి వెళ్ళడానికి వీలుగా నిచ్చెనలు ఏర్పాటు చేస్తారు. అంతేగాక ప్రతిరోజు మూడుపూటలా ఆనందనిలయంలో జరుపబడే నివేదన సమయంలో అర్చకులు ఆలయం లోపలి నుండే విమానవేంకటేశ్వరస్వామివారికి నివేదనలు సమర్పిస్తారు.

గర్భాలయంలో స్వామి తన భక్తుల మనోభీష్టాన్ని తీర్చేవాడైతే ఈ విమాన వేంకటేశ్వరుడు కేవలం మోక్ష ప్రదాత. అందుకనే ప్రదక్షిణ మార్గంలో వీరిని తప్పనిసరిగా దర్శించుకోవాలి.


గర్భాలయంలో స్వామిని దర్శించుకోవడానికే సమయం సరిపోదు. కనుక మన కోరికలన్నీ ఇక్కడ స్వామికి ఎంతసేపు కావాలంటే అంత సేపు నిలబడి అన్నీ మొక్కుకోవచ్చు.

**(అందరితోపాటు నిలబడి దణ్ణం పెట్టుకోవడమే తప్ప కారణం తెలియదు. మనం తెలుసుకోవలసిన విషయం)**



## ఈ వ్యాస రచయిత భమిడిపాటి రాధాకృష్ణ

*హాస్యబ్రహ్మ భమిటిపాటి కామేశ్వరరావు గారి పుత్రరత్నం. 'పండిత పుత్ర – అనే సామ్యాన్ని వీరిపట్ల వర్తించకుండా చాలా జాగ్రత్తపడ్డారు. కీర్తిశేషులు వంటి మేల్ రచనలను చేసి అందర్నీ తనదైన బాణీలో నోలలాడించారు. సినీమారంగ ప్రవేశం చేసి – నాటకరంగాన్ని చిన్నచూపు చూచినా, అప్పుడప్పుడు కొత్త కొంగ్రొత్త హాస్యధోరణి కల రచనల వంటకాన్ని చేస్తూనే ఉన్నారు. ఇది ఒకప్పుడు 'ఆంధ్ర ప్రభ'లో వారు వ్రాసిన వ్యాసం. రుచి చూడండి.*



# అన్నిటా వీడు 'తెలుగు వాడు'

ఓ నాటి సాయంత్రం బొంబాయిలో ఇండియాగేట్ దగ్గర ఇద్దరు వ్యక్తులు కొంచెం జోరుగా వాదించుకుంటున్నారట. "యు హౌమచ్ అంటే యు హౌమచ్" అని, మాటలు విసురుకుంటున్నారు, అంతలో ఆ ప్రక్కనే ఉన్న ఒక తెలుగాయన ఆనందంగా వచ్చేసి, 'మీరు తెలుగువారేగా!" అంటూ పలకరించాట్ట. వాళ్లు దాంతో ఖంగు తినేసి "ఏమిటి సార్! మేం తెలుగు మాటైనా మాట్లాడలేదు కదా? మీరెల్లా పసిగట్టేశాడు" అని అడిగార్ట.

"బాబులూ! పై దేశం వచ్చినా పరాయి భాషలో గింజుకునే వాళ్ళే తెలుగువాళ్ళు. పైగా యుహౌమచ్ అంటే నువ్వెంత అనే కదా? నువ్వెంత అంటే నువ్వెంతని అరగని ఇంగ్లీషులో తరగని దెబ్బలాటలాడేవాళ్ళు తిరుగులేని తెలుగువాళ్ళే!" అని నవ్వేసి, "ఏ దేశమేగినా ఎందు కాలిడినా, తెలుగువాడు తెలుగువాడే!" అంటూ పలకరించి వెళ్ళిపోయాట్ట!

తెలుగువాడికి తెలుగు భాషంటే చెప్పలేని ప్రేమ – ఆ ప్రేమని గుండెల్లోనే దాచుకుంటాడు గాని, అనవసరంగా బయటపెట్టక "ఐ ఏమ్ ఎ టెలుగు"! అంటాడు. ఆంధ్రదేశంలో ప్రస్తుతం జరుగుతున్న చాలా తెలుగు సభల్లో చూడండి ఉపన్యాసకులు తెలుగు అంత అలవాటు లేదని చెప్పుకుని, ఇంగ్లీషులో ఉపన్యాసాలిస్తున్నారు. ఈమధ్య ఓ ప్రముఖ తెలుగు సారస్వత సభలో, తొమ్మండుగురు మాట్లాడారు. అందులో ఏడుగురు తెలుగువారు ఇంగ్లీషులో మాట్లాడారు. ఆ మిగతా ఇద్దరు ఉపన్యాసకులూ, అమెరికా నుంచి వచ్చిన తెలుగువాళ్ళు, వాళ్ళు ఎంతో ఆప్యాయంతో వచ్చీరాని తెలుగులో మధురంగా ప్రసంగించారు.

తెలుగువాడికున్న భాషా సంపద, ఈ ప్రపంచంలో ఉన్న చాలా భాషలవాళ్లకి లేదు. మనకి మొత్తం 56 అక్షరాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా కొన్ని మాటలు తెలుగులో చెప్పడానికి వీలు దొరక్క ఇంగ్లీషులో వివరిస్తుంటాము.

ఉన్న ఈ ఏభై ఆరు అక్షరాల్లోనూ, కొన్ని మనకెందుకూ ఉపయోగపడవు. అందులో ముఖ్యంగా ఙ, ఞ, ఋ, ౠ, ఇల్లాంటి అక్షరాలు, ఇన్నివేల సంవత్సరాల్నుంచీ ఎక్కడా ఎక్కువగా వాడుకలో లేవు, అయితేం? ఇదంతా మన పెద్దలిచ్చిన ఆస్తి. అంచేత. ఒక్క అక్షరం కూడా జారిపోకుండా బిగించి ఇన్నాళ్ళూ నెత్తినెట్టుకుని మోసుగొస్తున్నాం!

తెలుగు అక్షరాల్లోంచి, తెలుగువాడి కేరెక్టర్ ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. ఒక అరవ అతన్నిగాని, మలయాళీని గాని ఒక ఊర్నించి మరో ఊరు ట్రాన్స్‌ఫర్ చేశారనుకోండి. ఒక సెట్టు వంటసామానులు సంచీ, చాప, తలగడ పుచ్చుకుని లింగు రంగా అని వెళ్ళిపోతాడు – అదే తెలుగువాడయితే, నాలుగు సెట్లు, పది సామాన్ల సంచులు పుచ్చుకుని నానా అవస్థలూ పడుతూ బయల్దేరతాడు. ఆ సామాన్లలో విరిగిపోయిన కుర్చీ, చిరిగిపోయిన చాపలూ, కీళ్లూడిపోయిన మంచాలూ, బీటలు తీసిన ఊరగాయ జాడీలూ, రాలిపోయిన చీపుళ్ళు – ఇవన్నీ ఎంతో అన్యాయం "ఏదో మన పెద్దలిచ్చింది వదిలెయ్యడాదనికి మనం ఎవళ్ళం?" అంటూ సరిపెట్టుకుంటూ, నెత్తినెట్టుకుని అష్టకష్టాలూ పడతాడు.

ఈ తెలుగు అక్షరాల్ని చూస్తూంటే, మరో తెలుగు నిజం బయటపడుతుంది. మరే భాషలోనైనా చూడండి. ఇంగ్లీషులో అక్షరం, అక్షరం, గొలుసుకట్టుగా కలుసుకుని బయల్దేరతాయి. హిందీలో, సంస్కృతంలో కూడా చూడండి. నెత్తిమీద అన్ని అక్షరాల్ని కలుపుతూ ఒక ఉమ్మగి గీత ఉంటుంది. కాని తెలుగులో క, చ, ట, త, ప ఎవడి పిలక వాడిదే. ప్రతీవాడూ, తనొక్కణ్ణే రైటంటాడు – ఇల్లైనా అమ్మేస్తాడే గాని, రాజీమాత్రం పడడు. ●






# మేరునగం ఆంధ్రకేసరి ప్రకాశం



***మద్రాసు నగరంలోనే ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ప్రభవించింది. బారిష్టర్‌గా, పత్రికాధినేతగా, సంపాదకునిగా, రాజకీయోద్యమ నాయకునిగా, ముఖ్యమంత్రిగా ప్రకాశంగారు చేసిన సేవలు గణనీయమైనవి. మద్రాసు చేజారినందుకు ఆ మహానుభావుడెంత పద్దారో ఈనాడు మద్రాసు మనకొద్దంటూ చేతులు దులుపుకుని ఆంధ్రాకు వెడదా మనుకొనే వారి కనువిప్పు కోసం ఈ వ్యాసం ప్రచు రించాం.***

మద్రాసు నగరంలో బారిష్టరుగా 14 సంవత్స రాలు. ప్రాక్టీసు చేసిన టంగుటూరి గాంధీజీ పిలుపు మేరకు వృత్తిని వదిలివేస్తున్నానని 1921 జనవరిలో ఒక బహిరంగ సభలో ప్రకటించారు. సంచలనాత్మక మైన ఈ వార్త మద్రాసు ఆంగ్ల పత్రికలలో మారు మూల స్వల్పంగా వేశారు. కారణం?

ఆనాటి పత్రికలకు గాంధీజీ కార్యక్రమంపై విశ్వాసం లేకపోవడమో లేదా ప్రభుత్వ వ్యతిరేకులకు ప్రాచుర్యం ఇచ్చి ఆగ్రహం పొందడం ఎందుకనో అంతకు పూర్వమే డాక్టరు పట్టాభి, ముట్నూరు కృష్ణారావు గారలు మద్రాసులో ప్రకాశం గారిని కలిసి నాలుగు పేజీలలో ఒక ఇంగ్లీషు పత్రిక మద్రాసు నుండి నడవమని కోరారు.

ప్రకాశం 1921 అక్టోబరు 29న స్వరాజ్య పత్రిక మద్రాసు నుండి ప్రారంభించారు.

3 లక్షల మూలధనంతో ముందుగా ఆంగ్లంలో తరువాత తెలుగు, తమిళంలో స్వరాజ్య నడపాలని ప్రకాశం వారి మిత్రులు తలపోశారు. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు ఇంగ్లండు నుండి ఆర్డరు చేసిన ఇరవై అయిదు వేల రూపాయల ప్రెస్సును ప్రకాశం నుండి డబ్బు తీసికొని వీరి వశం చేశారు. రాజాజీ ఈ కార్యక్రమాన్ని తొలుత పూర్తిగా అభినందించారు. స్వరాజ్యమా అని ప్రకాశంగారు పత్రికకు పేరు పెట్టదలిచారు. కాని రాజాజీ సలహా మేరకు స్వరాజ్య అనే పేరు స్థిరపరచారు.

మొదటి నెలలోనే 5 వేల కాపీలు అమ్ముడుపోయింది. స్వరాజ్య రెండవ నెల నుండి సర్క్యులేషన్ ఎనిమిది వేలకు చేరుకుంది. 1921 డిసెంబరులో అహమ్మదా బాద్ కాంగ్రెసులో గాంధీజీకి స్వరాజ్య పత్రిక సేవలను గూర్చి రాజాజీ వివరించారు. మహాత్ముడు సంతోషించారు. ప్రకాశం గారికి స్వరాజ్య ద్వారానే గాంధీజీ సన్నిహితులైనారు.

పత్రికా నిర్వహణకు ప్రకాశం ఎంపిక చేసిన రచయితలు కడు సమర్థులు. కేరళకు చెందిన ఆక్సుఫర్డు పట్టభద్రుడు కె.యం.పణిక్కర్ ఆంగ్ల స్వరాజ్యకు తొలి సంపాదకుడు. హమీద్‌ఖాన్, ఎన్.ఎస్. వరదాచారి, స్టాలిన్.కె, శ్రీనివాసన్‌లు కూడా వారితోపాటు వుండేవారు. అహ్మదాబాద్ కాంగ్రెస్ తీర్మానాలను ప్రజలలో వ్యాపింపచేయడానికి స్వరాజ్య గావించిన కృషి నిరుపమానమైనది. అనతి కాలంలో తమిళంలో వెలువడిన స్వరాజ్య తమిళనాడంతటా బహుశ ప్రచారం అందుకొన్నది.

తమిళ స్వరాజ్య సంపాదకులు కవియోగి శ్రద్ధానంద భారతి. వీరి పూర్వీకులు ఆంధ్రదేశంలోని అమలాపురం నుండి వలస వచ్చి తమిళ దేశంలో స్థిరపడినవారు. తెలుగు స్వరాజ్య సంపాదకులు శ్రీ మానకొండ సత్యనారాయణ శాస్త్రిగారు గొప్ప విద్వాంసులు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు ప్రభృతులు గౌరవ విలేఖరులుగా వుండేవారు. 1926 మేలో గాడిచెర్ల వారు వ్రాసిన లేఖలో ప్రకాశంగారు ఆంగ్ల స్వరాజ్యకు చాలామంది రచయితలు ఏలాటి గౌరవ వేతనం లేనివారే, బుర్రా సత్యనారాయణ, అబ్దుల్ హమీద్‌ఖాన్, తెన్నేటి విశ్వ నాథం, నీలం రాజు వెంకట శేషయ్య ఈ పత్రికలో వివిధ పదవులలో పనిచేశారు. ప్రముఖ పాత్రికేయులు శ్రీ యం. చలపతిరావు ప్రకాశం కేవలం ఒక వార్తా పత్రిక యజమాని కాదనీ, ఆయనొక మహాసంస్థగా దక్షిణదేశంలో జాతీయ భావాలు వెదజల్లాడని తెలిపారు.

ఒక్కొక్కసారి ప్రకాశం గారు సంపాదకీయాన్ని డిక్టేట్ చేసి కొన్ని ఖాళీలను ఖాసా సుబ్బారావును పూరించమనేవారట. శ్రీ ఖాసా వారికి ప్రకాశంగారి పట్ల ఎనలేని గౌరవం. స్వరాజ్య పత్రికలో ఒక పెద్ద మనిషి తనపై వచ్చిన విమర్శలకు కోపించి రచ యితపై చర్య తీసికోవాలని ప్రకాశం గారిని కోరాడు. ప్రకాశం బహిరంగంగా ప్రకటన చేస్తూ నన్ను కూడా తీవ్రంగా విమర్శించడం జరిగింది అని తెలిసి ఆ పెద్ద మనిషిని నిరుత్తరుణ్ణి చేశారు.

కాంగ్రెస్ సందేశాన్ని వ్యాప్తికి కృషి చేస్తూనే తనకు తప్పు అని తోచినపుడు ఎంతటి వారినైన విమర్శించడానికి స్వరాజ్య వెనుకంజ వేయలేదు. తనను తీవ్రంగా విమర్శిస్తున్న స్వరాజ్య సంపాదకులు ప్రకాశంగారికి రూ. 5000 వేలు విరాళమివ్వ జూపారు మోతిలాల్ నెహ్రూ.

1924లో గాంధీజీ స్వరాజ్యను మూసివేయ మని సలహా యిచ్చారు. ప్రకాశంగారు చాలా బాధపడినారు. మూడు లక్షల మూలధనంతో నెలకొల్పబడిన పత్రిక మూడు సంవత్సరాలుగా జాతీయోద్యమానికి అపార సేవలందిస్తున్న స్వరాజ్య మూసివేత సాధ్యం కాదని గాంధీజీకి ప్రకాశం నచ్చజెప్ప చూశారు. 1925 మార్చి 24 మద్రాసులో గాంధీజీ స్వరాజ్య పత్రిక కార్యాలయాన్ని సందర్శించారు. ప్రకాశంగారు మహాత్మునికి తమ కార్యకలాపాలు వివరించారు. నిర్భీకతకు మారుపేరైన ప్రకాశంగారు నిర్వహిస్తున్న స్వరాజ్యకు ఎదురైన ఒడిదుడుకులు అనేకం.

1924లో ఉన్నపాటున ప్రభుత్వం స్వరాజ్యను బ్లాకులిస్టులో చేర్చింది. ప్రభుత్వ దమన నీతిని దుయ్యబట్టి రాతలను సహించలేక చేసిన పని యిది అని మద్రాసు న్యూ ఇండియా పత్రిక ఖండించింది. ఆంధ్రపత్రిక, స్వరాజ్య పత్రికాధిపతులు అసహాయోద్యమంలో పాల్గొని జైలులో నుండగా ప్రభుత్వం వీటినుండి ధరావత్తూలను కోరింది. ఎలాంటి ముందు హెచ్చరిక లేకుండా ఇలా చేయటం అత్యంత దారుణం అంటూ స్వదేశ మిత్రన్ తమిళ పత్రిక 1930 జూన్ 16 సంపాదకీయంలో పేర్కొన్నది.

ప్రకాశంగారి స్వంత ఆస్తి, వసూలు చేసిన మూలధనం బర్మా మలయా దేశస్థులు ఉదారంగా ఇచ్చిన లక్షలాది రూపాయల విరాళాలు స్వరాజ్య పత్రిక మూతపడే నాటికి బూడిద పాలయినవి.

ప్రకాశం గారితో పాటు చివరి దాకా మిగిలిన జి.వి. కృపానిధి, ఖాసా సుబ్బారావు గారలు తమ దైన్యస్థితిని వివరించి చెప్పటానికి ప్రకాశం గారి గదిలోకి వెళ్లేవారు. ఆయన ముఖం చూసి తమతో బాటు ఆయన దరిద్రుడయిన సంగతి గుర్తుకు వచ్చి వెనుదిరిగేవారు.

జాతీయోద్యమంలో స్వరాజ్య చేసిన కృషి మరే పత్రికా చేసి వుండలేదు.

మొదట్నుంచీ ప్రకాశం గారి ధ్యేయం అంతా స్వరాజ్యం మీద, గ్రామ స్వరాజ్యం మీదే ఉండేది. గ్రామ స్వరాజ్యం పేరిట కూడా 1940-42 ప్రాంతంలో పత్రిక నడిపాడాయన. ఆయన జైల్లో వున్నప్పుడు కొంతకాలం మానికొండ సత్యనారాయణ శాస్త్రిగారు సంపాదకత్వం వహించారు. పంచాయితీల ద్వారా గ్రామ పునర్నిర్మాణం కావాలని కాంక్షించాడు ప్రకాశం. ఈనాడది 73వ రాజ్యాంగ సవరణ చట్టంగా ఫలించింది.

ప్రకాశంగారు పెట్టిన మరో పత్రిక ప్రజా పత్రిక. కాని అది త్వరలోనే ఆంధ్రావ తరణతో ఆగిపోయింది.

– 'కృష్ణా పత్రిక' సౌజన్యంతో

# ఓలేటి వేంకటేశ్వర్లు గారు



'నిద్దుర నిరాకరించి, ముద్దుగ తంబురబట్టి, శుద్ధమైన మనసుతో, సుస్వరముతో, పద్దు తప్పక భజియించే'... తోడిరాగంలోని ఈ త్యాగయ్య కృతి వినగానే, నాకు ఒక గాయకుని ఆకృతి మదిలో మెదలుతుంది. ఆయనెవరో కాదు... నిండైన విగ్రహంతో, ధవళ వస్త్రధారులై, తంబుర చేతబూని, కనులు మూసుకొని, తాదాత్మ్య స్థితిలో, గానాం బుధిలో తనిసి, తరించే ఓలేటి వేంకటేశ్వర్లుగారు.

ఒక విలక్షణమైన సంగీతం ఆయనది... గ్రీష్మ ఋతువులాంటి వెచ్చనైన కర్ణాటక సంగీతం పాడుతూ, అలవోకగా శరదృతువులో ప్రవేశించి, చల్లని వెన్నెలలాంటి హిందుస్థానీ సంగీతాన్ని స్పృశించి, పరవశింపజేయగల సవ్యసాచి ఆయన!

ఆయనకున్న స్వరజ్ఞానం అనన్యసామాన్యం. రేడియోలో ఎవరయినా ఒక కీర్తన పాడుతుంటే, వింటూ, అదే వేగంతో ఆ సాహిత్యాన్ని స్వరసహితంగా వ్రాసేసే వారాయన!

పుట్టింది– 27–8–1928న, రాజమహేంద్రిలో. సంగీతంలో తొలి పాఠాలు నేర్చింది – అచ్యుతరామయ్య శాస్త్రి, మునుగంటి వెంకటరావు పంతులుగార్ల వద్ద. అయితే, ఆయనకు బాణి నేర్పినవారు డా.శ్రీపాద పినాకపాణిగారు. 'ఓలేటిలాంటి ప్రజ్ఞాశాలి ఇక పుట్టడు' అంటారు గురువు పాణిగారు.

బెజవాడ ఆకాశవాణి చేసుకున్న అదృష్టమేమిటో! ఓలేటిగారి వంటి స్రష్టలను అక్కున చేర్చుకుంది. 1966లో రేడియో ప్రవేశం చేసిన నాటినుండి, సంగీత ప్రయోక్తగా ఆయన నెరపని సంగీత ప్రక్రియలేదు. 'భక్తిరంజని' కోసం ఎంతో ప్రయాసకోర్చి, ఆధ్యాత్మరామాయణ కీర్తనలను సేకరించారు. సదాశివబ్రహ్మేంద్ర సరస్వతి కీర్తనలను, నారాయణతీర్థ తరంగాలను స్వరపరచి, పదిలపరిచారు. ఎన్నో యక్షగానాలకు రూపునిచ్చారు. లలితగీతాలకు బాణీలు కట్టారు.ఆయన పాడిన 'హనుమాన్ చాలీసా' బహుళ ప్రసిద్ధమైనది. 'నగవులు నిజమని', 'కందర్ప జనక' లాంటి అన్నమయ్య కీర్తనలను, 'మనసౌనే ఓ రాధ', 'తలనిండ పూదండ' వంటి లలితగీతాలను, 'భజోరే భయ్యా'... వంటి హిందీ భజన్లు, స్వరపరచి, ఆలపించా రాయన.

హిందుస్థానీ సంగీత దిగ్గజం– బడేగులాం ఆలీఖాన్, ఆయనకు దైవ సమానులు. ఒకమారు ఖాన్ గారు హైదరాబాదులో కచేరీ నిమిత్తం వచ్చినపుడు వారి దర్శనం చేసుకున్న ఓలేటిగారు, 'మీరు అనుమతిస్తే... మీరు రికార్డులో పాడిన ఒక ఠుమ్రీని పాడి, వినిపిస్తాను' అన్నారట. 'పాడమని' సంజ్ఞచేశారు ఖాన్ సాహెబ్. అంతే... ఓలేటిగారు కనులు మూసుకొని, గానం ఆరంభించారు. ఖాన్ గారితో సహా అక్కడ ఉన్న యావన్మందీ మంత్రముగ్ధులయ్యారు. గానం పూర్తి అయింది. ఖాన్ సాహెబ్ ఓలేటిగారితో 'నిజంగా ఆ రికార్డులో నేనింత బాగా పాడానా!' అన్నారట ఆనందంగా...

ఓలేటిగారు, ఖాన్ గారికి ఎంత అభిమాని అంటే... తన గాత్రాన్నే కాదు, శరీరాకృతిని కూడా ఖాన్ గారిలా మార్చుకున్నారేమో! అనిపించేది...

ఓలేటిగారు నిగర్వి, అల్పసంతోషి. 'ఒక బహుళ అంతస్థుల భవంతి, తానే గొప్పని, ఎత్తైనదానినని విర్రవీగితే, ఏంలాభం? చిన్న పిట్ట ఎగిరి, దాని నెత్తిమీద కూర్చోదుటండీ! ఈనాటి ప్రతిభావంతులైన పిల్లలు పాడుతున్న సంగీతం ముందు, మన సంగీతమెంత సార్..?' అనేవారు మిత్రులతో ఆయన.

నిజం చెప్పాలంటే, ఆయనకు తెలుగునాటకన్నా, తక్కినచోట్లనే అభిమానులు మెండు. మద్రాసు మ్యూజిక్ అకాడెమీలో ఆయన చేసిన చిట్టచివరి కచేరీ వినే అదృష్టం కలిగింది నాకు. వరాళి రాగం ఆనాటి ప్రధానాంశం. రసప్రవాహమై సాగిన నాటి కచేరీ అనంతరం, అసంఖ్యాక శ్రోతలు వేదికపైకి తోసుకొచ్చి, వోలేటి గారి పాదాలను తాకి నమస్కరించిన దృశ్యం నేను మరువలేను. ఆనాడు కోయంబత్తూరు వంటి దూర నగరాలనుండి వచ్చిన సంగీత సభానిర్వాహకులు ఎందరో, తమ సభలో కచేరీ చేయవలసిందిగా అర్థిస్తే, 'నేను ప్రయాణం చేసి రాలేనని' సున్నితంగా వోలేటిగారు తిరస్కరించటం ఇంకా గుర్తుంది నాకు.

అదే... ఓలేటిగారి కచేరీ, ఒకసారి బెజవాడ రోటరీ ఆడిటోరియంలో జరిగితే... పట్టుమని పాతిక మంది లేరు. కనులు మూసుకొని తన పాటలో లీనమైపోయిన ఓలేటిగారిని చూస్తే నాకప్పుడనిపించింది... 'ఏ శ్రోతలు వింటున్నారని కొమ్మ గుబురుల్లో దాగి, అంత కమ్మగా కోయిలమ్మ పాడుతుంది?' అని.

ఓలేటిగారు రేడియోలో నిర్వహించిన 'సంగీత శ్యామల' అనే రూపకంలో చిన్నప్పటి శ్యామశాస్త్రి పాత్రలో నటించే అవకాశం వచ్చింది నాకు.అప్పుడు నాకు పధ్నాలు గేళ్ళు. నాటరాగంలో బీజాక్షరాలతో కూడిన ఒక శ్లోకం పాడవలసి వచ్చింది. రాగం మీదే దృష్టి పెడుతూ, శ్లోకం అనలేకపోతున్న నాతో, 'నువ్వు రాగం గురించి ఆలోచిం చకు. అది ఎలాగూ తప్పురాదు నీకు. ఉచ్చరించే అక్షరాలపై మనసుపెట్టి చూడు' అన్నారాయన. ఆశ్చర్యం! అది పాటించిన వెంటనే ఆశ్లోకాన్ని దోషరహితంగా పాడగలిగాను. నా గాత్రాన్ని మెచ్చుకొని, నన్ను ప్రోత్సహించేవారాయన.

ఓలేటిగారికి ముఖతః పెద్దగా శిష్యులు లేరనే చెప్పాలి. అయితే, బెజవాడ రేడియోలో సుదీర్ఘ కాలం ఆయన నిర్వహించిన 'సంగీత శిక్షణ' ప్రసారం కోసం, తమిళనాట కూడా విద్యార్థులు ఎదురుచూసేవారు. కొన్ని వందల కృతులు ఆవిధంగా ఆయన నేర్పారు. రేడియో వారి 'వాణి' అనే పక్షపత్రికలో ఆ కృతుల స్వరలిపి ప్రచురింపబడేది.

మెహ్దీ హసన్, గులాం ఆలీ గజల్స్ అంటే ప్రాణమిచ్చేవారాయన! ఆ గాయకులు ఆలపించిన బాణీలకు రజని, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గార్లవంటి కవులచే సాహిత్యం వ్రాయించుకొని, పాడేవారాయన!

కేంద్ర సంగీత నాటక అకాడెమీ అవార్డు, 'సంగీత చూడామణి', 'సుర్ సింగార్' బిరుదులు మాత్రం లభించాయి ఆయనకు. ప్రఖ్యాత వైలిన్ విద్వాంసులు లాల్గుడి జయరామన్ గారు, ఓలేటిగారి కోరిక మేరకు 'పహాడి' రాగంలో తిల్లానా రచించారు.

29–12–1989 న తనువు చాలించిన ఓలేటి వేంకటేశ్వర్లు గారిని తెలుగు రాష్ట్రాలవారు మరచినా, నరేంద్రనాథ్ మీనన్ వంటివారు వారిని సంస్మరించు కుంటూ తమిళనాట, ఈనాటికీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ●

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని -
చెన్నై

# పండితుడి వేద గణితం

చదరంగం ప్రియుడయిన ఒక రాజు వద్దకు ఒక వేద పండితుడు వచ్చాడు. ఆ పండితుడు అతన్ని ఒక ఘనపనస చదివి ఆశీర్వదించాడు.

అప్పుడు ఆ రాజుగారు "ఏమయ్యా! పండితా! ఈ వేదపనసలు ఎవరైనా నేర్చుకుని చదవవచ్చు! చదరంగం ఆడడానికి సహజమైన తెలివి కావాలి. నాతో కేవలం ఒక 20 ఎత్తులు పూర్తయ్యే వరకు ఆడి నిలువు! అప్పుడు నువ్వడిగిన కోరికను నెరవేర్చుతాను." అన్నాడు.

అప్పుడు ఆ పండితుడు "రాజా! నాకు చదరంగం వస్తుందని కాదు గానీ, మిమ్ములను సంతోషపరచడానికి ఆడతాను" అంటూ రాజుతో చదరంగం ఆడి 20 ఎత్తులు పూర్తయ్యే వరకు నిలిచాడు.

రాజు గారూ ఆటను చివరి వరకూ కొనసాగిద్దాం! అన్నాడు. కానీ ఆ పండితుడు "రాజా! ఆటను ఇక్కడితో ఆపడం నాకు క్షేమమూ – గౌరవం కూడా! రాజు గారితో 20 ఎత్తుల వరకు ఆడగలిగాను అని గొప్పగా చెప్పుకోవచ్చు!" అంటూ సున్నితంగా తిరస్కరించాడు.

"సరే! పండితా! నీ తెలివిని గుర్తించాను. మాట ఇచ్చినట్లుగా నీ కోరిక నేరవేర్చుతాను. చెప్పు!" అన్నాడు రాజుగారు.

"మహారాజా! చదరంగంలో 64 గడులు ఉంటాయి కదా! ఒక గడిలో ఒక గింజ – రెండవ గడికి అంతకు రెట్టింపు రెండు గింజలు – మూడవ గడికి మళ్లీ రెట్టింపు 4 గింజలు – నాలుగవ గడికి మళ్లీ రెట్టింపు 8 గింజలు .... ఇలా 64 గడులకు లెక్క వేసి ఆ ధాన్యాన్ని పంపండి చాలు! అదే మహాప్రసాదం." అంటూ ఆ పండితుడు వెళ్లిపోయాడు.

రాజు సరే ! అని ఆ పని మంత్రికి పురమాయించాడు.

ఆ పండితుని వెంట మంత్రి గారు కూడా వెళ్లి తన ఆస్థాన గణికులతో ఎంత ధాన్యం అవుతుందో విచారించాడు.

తిరిగి వచ్చిన మంత్రితో రాజుగారు "పండితుడడిగాడు కదా.. మొదటి గడిలో ఒక ధాన్యపు గింజ.. రెండవ గడిలో దానికి రెట్టింపు రెండు.. మూడవగడిలో దానికి రెట్టింపు నాలుగు.. తర్వాత 8 గింజలు, ఐదవ గడిలో 16 గింజలు.. 'అయితే ఏముంది.. చదరంగంలో ఉన్నదంతా 64 గళ్లేగా.. ఇచ్చుకోవలసిందేమో గడికీ గడికీ రెట్టింపు.. వెఱ్ఱి పండితుడు.. గింజలకు గింజలు రెట్టింపు చేసుకు పోయినా ఎన్నివస్తాయి..? ఏదేనా మంచి అగ్రహారం కోరుకుని ఉండాల్సింది..'

"అలా తీసెయ్యకండి మహారాజా !.. ఆ పండితుడేమీ వెర్రిబాగులవాడు కాదు.."

"ఎందుచేత..?" అన్నాడు రాజుగారు.

"లెక్క కట్టి చూసుకుంటే.. ఆ పండితుడడిగిన ధాన్యపు గింజలు ప్రపంచంలో ఎవరూ ఇవ్వలేరు కనుక..!"

"ఎందుకు..?" ఆశ్చర్యపోతూ అడిగాడు మహారాజు

"ఎన్ని ధాన్యపు గింజలో మన గణికులు గంటలకొద్ది లెక్కించి చెప్పిన సంఖ్యను ఆ పండితుడు వేదగణితం ద్వారా క్షణంలో చెప్పేసాడు మహారాజా ! అంతే కాదు దాన్ని సులువుగా గుర్తుంచుకునే విధంగా ఆశువుగా ఒక చంపకమాల పద్యం కూడా చెప్పాడు."

"అలాగా.. ఏమిటా పద్యం..?"

"ఇదుగో.. వినండి మహారాజా !"

**శర శశి షట్క చంద్ర శర**
**సాయక రంధ్ర వియత్ నగాగ్ని భూ**
**ధర గగనాబ్ధి వేద గిరి**
**తర్క పయోనిధి పద్మజాస్య కుం**
**జర తుహినాంశు సంఖ్యకు ని**
**జంబగు తచ్చతురంగ గేహ వి**
**స్తర మగు రెట్టికగు**
**సంకలితంబు జగత్ప్రసిద్ధిగన్**

పద్యం విన్న మహారాజు "దీన్లో తేలిన లెక్కెక్కడుంది..? అంతా బాణాలూ, చంద్రులూ, ఆకాశం, అంబుధి, కొండలు తప్ప.."

"అదే మహారాజా ! మనదేశ పండితుల మేధ.. సంక్షిప్తంగా అల్పాక్షరములతో అనల్పార్థసాధకంగా ప్రజ్వరిల్లిన మేధాశక్తి అది.."

"సరే సరే.. విప్పి చెప్పు..."

"ఈ పద్యంలో లెక్కచిక్కు విడిపోవాలంటే మనపూర్వుల సంఖ్యాగణన పద్ధతి తెలియాలి.. వారు ఒక్కొక్క అంకెకు విశ్వంలో విరాజిల్లే ప్రకృతిశక్తులను సంకేతాలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ పద్యంలో

శర, సాయక, – అనే పదాలకు అర్థం బాణాలు అని. (మన్మథుని పంచసాయకములు) ఇక్కడ ఆ రెండు పదాలు 5 సంఖ్యను సూచిస్తాయి.

గగన, వియత్ – 0 (ఆకాశం గగనం శూన్యం)

శశి, చంద్ర, తుహినాంశు –1 (చంద్రుడొకడే భూమికి)

షట్కము – 6

రంధ్ర – 9 (నవరంధ్రాలు)

నగ, గిరి, భూధర – 7

అగ్ని – 3 (మూడగ్నులు గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని)

అబ్ధి, పయోనిధి – 4

వేద –4 (చతుర్వేదములు)

తర్క – 6 (షట్ తర్కప్రమాణాలు, 'ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద, అర్థాపత్తి, అనుపలబ్ధి')

పద్మజాస్య – 4 (పద్మజుడు బ్రహ్మ, చతుర్ముఖుడు)

కుంజర – 8 (అష్ట దిగ్గజములు)

ఇవీ ఇందులోని అంకెలసంకేతాలు.. ఇప్పుడు ఇవి ఆయా పదాల దగ్గర పెట్టుకుని చూస్తే.."

| | | | | |
|---|---|---|---|---|
| శర | శశి | షట్క | చంద్ర | శర |
| 5 | 1 | 6 | 1 | 5 |
| సాయక | రంధ్ర | వియత్ | నగాగ్ని | భూ |
| 5 | 9 | 0 | 7 | 3 |
| ధర | గగనాబ్ధి | | వేద | గిరి |
| 7 | 0 | 4 | 4 | 7 |
| తర్క | పయోనిధి | పద్మజాస్య | కుం | |
| 6 | 4 | 4 | | |

జర తుహినాంశు సంఖ్యకుని

8 1

జంబగు తచ్చతురంగ గేహ వి

స్తర మగు రెట్టికగు సంకలితంబు జగత్ప్రసిద్ధిగన్

అంకెలు లెక్కించెటప్పుడు మనపూర్వీకుల సాంప్రదాయ సూత్రం .. 'అంకానాం వామతో గతిః' –

కుడినుంచి ఎడమకు చేర్చి చదువుకోవాలి..

అలా చేస్తే చివరగా తేలిన సంఖ్య.

1, 84, 46, 74, 40, 73, 70, 95, 51, 615

ఒకకోటి 84 లక్షల 46 వేల 74 కోట్ల 40 లక్షల 73 వేల 70 కోట్ల 95 లక్షల 51 వేల 615

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

ఇంత పెద్ద సంఖ్యను పిలవడమే కష్టం. ఇక ఇంతోటి ధాన్యాన్ని నిలవచేయాలి అంటే,

ఒక ఘనమీటరు విస్తృతిగల గాదెలో దాదాపు ఒకటిన్నర కోటి గింజలు దాచవచ్చు అని అంచనా వేసుకుంటే,

4మీటర్ల ఎత్తు 10 మీటర్ల నిడివిగల గాదెలు దాదాపుగా 12,000 ఘనకిలోమీటర్లు విస్తీర్ణం కావాలి..

పేర్చుకుంటూ వెళితే 300,000,000–ముప్పై కోట్ల కిలోమీటర్లు.. అంటే భూమికి సూర్యునికి ఉన్నదూరానికి రెట్టింపు.

పోనీ లెక్కపెట్టడానికి ఎంత సమయం పడుతుందో అంటే

సెకనుకు ఒక్కగింజగా లెక్కించితే అన్నీ లెక్కించటానికయ్యేవి 58,495 కోట్ల సంవత్సరాలు.. అదీ సంగతి.

వేదపండితులతో వేళాకోళం తగదు మహారాజా! నిజానికి అతడు చదివిన గణపనస కూడా లెక్కలకు, ధారణ శక్తికి సంబంధించినదే! ఎంతో ధారణ శక్తి – పాండిత్యం – సాధన ఉంటేకానీ గణాపాటి కాలేరు. అతడు ప్రేమగా ఆశీర్వదించ డానికి వస్తే అతని వేదవిద్యను కించపరిచారు. ఇప్పుడు ఏం చేయడం? మాట తప్పిన దోషం సంక్రమిస్తుంది.

అది విన్న మహారాజు సిగ్గుపడ్డాడు. అతని పూర్వీకులనుండి ఎవ్వరు కూడా ఇప్పటివరకు మాట తప్పలేదు.

ఏం చేసి ఈ దోషం నుండి తప్పించుకోవలో ఆ పండితున్నే అడుగుదాము. అని ఆ పండితున్ని పిలిపించి క్షమించుమంటూ వాగ్దాన భంగ దోషం అంటకుండా ఏం చేయాలో చెప్పమన్నాడు.

ఆ పండితుడు' "రాజా ! ఈ లోకంలో ఆవుకు విలువ కట్టలేము. ధాన్యం బదులుగా ఆవును ఇవ్వండి చాలు!" అని ఆ రాజును వాగ్దాన భంగ దోషం నుండి తప్పించాడు.

పద్యం :: పాత గ్రంథాలనుండి

**– వేంకటేశ్వరాచార్యులు వైద్యం**

# పోతన భాగవత పద్య చమత్కారాలు

**పో**తన గారి కవిత్వ ప్రతిభకు భాగవతంలో ఎన్నెన్నో తార్కాణాలు ఉన్నాయి. రెండు విరుద్ధ భావాలను ఒకే పద్యంలో అలవోకగా పలికించారు పోతనగారు ఆ పద్యం :

**క. ఓ యమ్మ నీ కుమారుడు**
**మా యిండ్లను పాలు పెరుగు మననీడమ్మా**
**పోయెదమెక్కడి కైనను**
**మా యన్నల సురభులాన! మంజుల వాణీ!**

రెండు భావాలు ఎలాగో చూద్దాం.

**భావం 1 :**

ఓ యశోదా! నీ కొడుకైన కృష్ణుడు, మా యిండ్ల లోని పాలు, పెరుగు ఉండనివ్వడు. ఈ ఊరు వదలి ఎక్కడికైనా వెళ్లిపోతాం. అయినా నీకు నమ్మకం కలగకపోతే, మా అన్నల మీదా, మా పశువుల మీదా ఒట్టు.

**భావం 2 :**

ఓ యశోదా! నీ కొడుకైన కృష్ణుడు, (నీ కుమారుడు) మాకు మన్మథుడు. మా యిండ్ల లోని ఓ భాగం (మా యిండ్లను పాలు) మా యిండ్ల లోనే పెరుగుతాడు (పెరుగు). మనకు నీడమ్మా (మననీడమ్మా). ఈ ఊరు వదలి ఎక్కడికి వెడతాం (పోయెదమెక్కడికి). (ఐనను) అయినా నీకు నమ్మకం కలగకపోతే, మా అన్నల మీదా, మా పశువుల మీదా ఒట్టు.

**పోతనగారి కవిత్వంలో ఎన్నెన్నో చమత్కారాలు**

భక్తి భావాలతో రచితం. బమ్మెరవారి ప్రతిభకు ఆ పద్యాలు నిలువెత్తు అద్దాలు. భాగవతంలోని మొదటి పద్యంనుండీ ప్రతిపద్య పదప్రయోగ నైపుణ్యం దర్శనమిస్తుంది. **– వేంకటేశ్వరాచార్యులు వైద్యం**

# ఆదిభట్లగారి అభిమాన కవులు

**హ**రికథకుడుగా ఆదిభట్లనారాయణదాసుగారు గజ్జె కట్టిన తొలినాళ్లలో పోతన పద్యాలను తాను విరివిగా వాడుకున్నట్లు స్వీయ చరిత్రలో చెప్పుకున్నారు. నారాయణదాసునకు సంస్కృతకవులలో జయదేవుడు, తెలుగు కవులలో పోతన ప్రీతిపాత్రులని, ఆయన రచించిన ప్రహ్లాద చరిత్ర పీఠికలోని ఈ కింది పద్యం సుస్పష్టం చేస్తోంది.

**తే. పూర్వ కవు లందరున్ కడు–పూజ్యులందు**
**భాగవతులయి గోస్తనీ–పాకముగను**
**గృతులొనర్చు నధికుల సం–స్కృతమున 'జయ**
**దేవు', దెనుగున 'బోతన'–దెలిసి యెంతు.**

నే నెరిగినంతలో అమలినమైన శృంగార, భక్తి వర్ణనలను రచించడంలో జయదేవ, పోతనలు నిరుపమానులు. నాకు కూడా సంస్కృతాంధ్రాలలో మిక్కిలి అభిమాన కవిశ్రేష్ఠులు జయదేవ, పోతనలు.

**– వేంకటేశ్వరాచార్యులు వైద్యం**

# పేరడీల గారడీలు

క. అప్పిచ్చువాడు, వైద్యుడు,
ఎప్పుడు నెడతెగకపారు–యేరున్ ద్విజుడున్
చొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు–చొరకుము సుమతీ!

**శ్రీ శ్రీ, పేరడీ–**

క. ఎప్పుడుపడితే అప్పుడు
కప్పెడు కాఫీ నొసంగ–గలిగిన సుజనుల్,
చొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూరు –చొరకుము మువ్వా!
ఏ దేశ చరిత్ర చూసినా–ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం–పరపీడన పరాయణత్వం

**– శ్రీశ్రీ**

**మాచిరాజు దేవీప్రసాద్, పేరడీ–**

ఏ రోడ్డు చరిత్ర చూసినా–ఏమున్నది గర్వకారణం
రహదారి చరిత్ర సమస్తం–యాతాయాత జనసంయుక్తం.

**శ్రీశ్రీ–**

తాజ్ మహల్ నిర్మాణానికి
రాళ్లెత్తిన కూలీలెవ్వరో?

**జలరుక్ శాస్త్రీ, పేరడీ–**

పిరదౌసిని రాసేటప్పుడు
తగలేసిన బీడీలెన్నో?

**– వేంకటేశ్వరాచార్యులు వైద్యం**

**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

**81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.**
**Phones : 28152387, 28154653**

***The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation***



# బాలగాంధర్వం

కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరునికి గళం అరువిచ్చినదెవ్వరు?

అభినవ గాంధీ బెన్ కింగ్స్ లే తెలుగులో ఎలా మాట్లాడారు?

ప్రముఖ హిందీ నటుడు అనిల్ కపూర్ తెలుగులో నటించారు. కానీ, స్లం డాగ్ మిలియనీర్‌లో తెలుగులో ఎలా సంభాషించారు?

దశావతారి కమల్ నటనతో జీవం పోస్తే, పది వేరువేరు గళాలతో అలరించిన దెవరు?

వీరందరి గొంతులో జీవంపోసి గాంధర్వ మాధుర్యం అందించిన అపర అన్నమయ్య...

పద్మభూషణ్ కలైమామణి మియా తాన్ సేన్ డా. పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం.

ఏదివిలో విరిసిన పారిజాతమో...
ఈ భువిపై మెరిసిన సినీ గీతమో...
శంకరాభరణ ఓంకార నాదశరీరమో...
తేరా మేరా బీచ్ మె బంధనమో...
సాగరసంగమ తకిటతధిమో...
తానై తరలి వచ్చిన వసంతమో...
దివి నుంచి భువికి దిగి వచ్చి...
మనసుల నెగ్గిన భావగాన వీచిక...
బాలసుబ్రహ్మణ్యం...గాత్రం!

ఏ పాట విన్నా, మరొక సారి నోట నానిందంటే... అది ఖచ్చితంగా బాల సుబ్రహ్మణ్యం పాటేమోనని అనుమానించాల్సిందే! అదే ఆయన ప్రత్యేకత.

"రత్తలు వస్తావా, అడిగింది ఇత్తావా.." అంటూ మిమిక్రి చేసి పూర్తిగా ఒక పాట పాడిన వ్యక్తి బహుశ అరుదే అని చెప్పాలి. అల్లురామలింగయ్య లాంటి సీనియర్ కామెడియన్‌కి ఆయన గొంతులోనే పాడి మెప్పించిన బాలు, పాటలు పాడేటప్పుడు స్వంతగా చేసే గిమ్మిక్కులు ఎందరినో ఆకట్టుకుంటుంటాయ్. చాలా కాలంగా అనుసరణీయాలయ్యాయ్!

ఒకటా రెండా! టన్నుల కొద్దీ పాటలు, తవ్వే కొద్దీ మాధుర్యం, కోట్ల మనసుల్లో స్థానం...ఇవన్నీ కేవలం అతనికే సాధ్యం. ఖచ్చితంగా నభూతో న భవిష్యతి అనేవి




ఆయనకి అచ్చుగుద్దినట్లు సరిపోతాయి. ఈ పదాలు వారి పరిశ్రమకు కొలమానం కాకపోవచ్చు. కానీ వాస్తవ దూరం మాత్రం కాదు. నిత్యం మనందరి మనసుల్లో తీయగా.. చల్లగా పాటలు పాడే బాలుని, "ఎస్.పి.బి" అని అందరూ తమవారిలా పిలుచుకుంటారు. ఆయన అసలు పేరు పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం.

సినీ వినీలాకాశంలో పుట్టిన ఓంకార నాదం, వెండితెర లోకంలో విరిసిన ఒక పారిజాతం, ఆ స్వరం స్వర్గం అంచులు చూపిస్తుంది. ఆ గానం రసడోలికలలో ముంచి తేలుస్తుంది.

నలభై సహస్రాలు పైగా పాటలు పాడి అందరి మనసుల్లో నిలచి,అందరి నాలుకలపై నడయాడుతున్న శ్రీ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం... నిత్య విద్యార్థి అని తనకు తాను చెప్పుకునే బాలసుబ్రహ్మణ్యం... వయసుతోపాటు మనసునీ సువిశాలం చేసుకుంటూ ఉన్న బాలసుబ్రహ్మణ్యం... అందరూ ' బాలూ' అని పిలుచుకున్నట్లుగా కొన్నిసమయాల్లో నిజంగా చిన్నపిల్లాడే అనిపించేలా ఉండేవారు. ఆ మహనీయుడిని స్మరించుకుంటూ, వారిని గురించిన కొన్ని విశేషాలు తెలుసుకుందాము.

## బాల్యం - కుటుంబం

నెల్లూరు జిల్లా కోనేటమ్మపేటలో ప్రముఖ హరికథా కళాకారుడు ఎస్పి సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కూతుళ్ళు. వారిలో రెండవ వాడు బాలసుబ్రహ్మణ్యం. 1946 జూన్ 4 వ తేదీన గానగంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం జన్మించారు. ఆ సమయంలో సంగీత సరస్వతి తన వీణ శ్రుతి చేస్తూ ఉండి వుంటుంది. అందుకేనేమో సంగీత నేపథ్యంలేకున్నా, సినిమా పరిశ్రమకు పరిచయం ఐన1966 నాటి నుండి, నేటీ వరకూ నలభై వేలకు పైగా పాటలు పాడారు. అనేక భారతీయ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ, తుళు, ఒరియ, అస్సామీ, బదగా, సంస్కృతం, ఆంగ్లం,



కొంకిణి, బెంగాలీ, మరాటీ, పంజాబీ లాంటి అనేక భాషలలోని పాటలకు అనర్గళంగా తన గొంతును అరువిచ్చి, అరవనిచ్చి, ప్రాంతాల కతీతంగా అనేక హృదయాలలో కొలువైయ్యాడు మన ఎస్.పి.బి. బాలు పాట ద్వారా తమ అదృష్టాన్ని పరీక్షించుకున్న వాటిలో సినిమాలే కాదు బుల్లితెర సీరియళ్ళు, వాటి టైటిల్ సాంగ్స్, ప్రైవేట్ ఆల్బంలు, మతాల కతీతంగా ప్రార్ధనాగీతాలు కూడా వున్నాయ్. పలురకాలుగా పాటలు ఆలాపించి, దక్షిణభారతదేశ చరిత్రలో అద్వితీయ, అపురూప, అపూర్వ నేపథ్య గాయకునిగా పుటల్లో పేరు సంపాదించుకున్నారు బాలు.

ఇంతగా కోటానుకోట్ల అభిమానుల మనసుల్లో ఒదిగిన బాలసుబ్రహ్మణ్యం గారికి ఇష్టమైన గాయకుడు రఫీ. రఫీ గారి గాత్రంలో అనిర్వచనీయమైన మాధుర్యం వుందని, నిద్రపుచ్చుతున్నంత ఆహ్లాదంగా వుంటుందంటుంటారు బాలు. బాలు భార్యకి కూడా రఫీ గారంటే చచ్చేంత ప్రాణం.

ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం భార్య పేరు సావిత్రి. ఈ అనురాగ దంపతులకు ఒక కూతురు పల్లవి, కుమారుడు చరణ్. (పల్లవి చరణాలను తన పిల్లలకు పేర్లు పెట్టుకుని పాట పై తన మమకారాన్ని చాటుకున్నాడు బాలు.)

బాలు సోదరి ఎస్.పి. శైలజ కూడా నేపథ్య గాయకురాలిగా తన ప్రస్థానాన్ని అన్న బాలు అడుగుజాడల్లో కొనసాగిస్తున్నారు. బాలు కుమారుడు ఎస్.పి చరణ్ కూడా నేపథ్యగాయకుడిగా చాలా పాటలు పాడాడు.

## సినిరంగ ప్రవేశం

బాలు కి తండ్రి హరికథా కౌశలం కాస్త ఒంటబట్టిదని చెప్పుకోవచ్చు. చిన్ననాటి నుండే చక్కగాపాడటం అలవడింది. అనేక పోటీలలో పాటలుపాడి పలువురు ప్రముఖులచే శెభాష్ అనిపించుకున్న బాలు గారి గురించి చాలామందికీ తెలియని ఒక విషయమేమిటంటే, బాలు చాలా చక్కగా ఫ్లూట్ వాయిస్తారట. మురళి గాన లోలుడన్నమాట. బాలుని సాంబమూర్తిగారు ఇంజనీరింగ్ చేయించేందుకు తొలుత అనంతపురం పంపారు. అక్కడ కుదురులేకుండా తిరిగొచ్చిన బాలుని ఎ.ఎం.ఐ.యి చేసేందుకు మద్రాసు (ఇప్పటి చెన్నై) కి పంపారు.

అక్కడే భారతదేశం గర్వించదగ్గ నేపథ్యగాయకుడు బాలుని ప్రపంచానికి పరిచయం చేసే సంఘటన ఒక వేదిక పై జరిగింది. 1964లో మద్రాసులో ఒక పాటల పోటీలో అలవాటుగా పాల్గొన్న బాలు గళ మాధుర్యాన్ని గమనించారు ఆ కార్యక్రమానికి విచ్చేసిన ప్రఖ్యాత సినీ సంగీత దర్శకులు కోదండపాణి గారు. విశ్వామిత్రుని వెనుక వడివడి అడుగులేసిన శ్రీరాముడల్లే, బాలుని బుడిబుడి అడుగులు కోదండపాణిని అనుసరించాయి. ఆ నీడలో ఆసేతు హిమాచలం అంతగా ఎదిగారు బాలు. డిసెంబర్ 15 1966 లో హాస్య నటుడు పద్మనాభం నిర్మించిన, కోదండపాణి గారు స్వరపరచిన 'శ్రీశ్రీశ్రీమర్యాదరామన్న'లో తొలిగా తన స్వరం సరిచేసుకున్నారు బాలు.

అది 1966 వ సంవత్సరం.. డిసెంబర్ 15 తేదీ..

స్థలం : మద్రాసు, రికార్డింగ్ థియేటర్

శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న పాటల రికార్డింగ్ జరగబోతోంది... రికార్డింగ్ థియేటర్‌కి నూనూగుమీసాల నూత్నయవ్వనమున వున్న ఒక చిన్నకుర్రాడు వచ్చాడు.

రికార్డింగ్ థియేటర్ లో ఒక వ్యక్తి... తన తోటి ఉద్యోగితో...

"ఎన్నప్ప ఇవల చిన్నపయ్యన్ ఎన్న పాడ పోరాన్."

"యార్ ఇవనై కూపిట్టదు"

("ఏవయ్య ఇంత చిన్న కుర్రాడు ఏమి పాడతాడయ్యా??... ఎవరయ్య వీణ్ణి పిలిచింది. " అని అన్నాడు.)

తమిళం అప్పటికి ఏమీ రాని ఆ కుర్రాడు చిరునవ్వుతో లోపలికెళ్ళాడు. రికార్డింగ్ పూర్తిచేసుకుని తిరిగి వెళ్తుండగా,

అదే వ్యక్తి మరలా బిత్తరపోయి చూస్తూ...

"ప్రమాదం – అద్భుతం ఇవన్ నల్లా పాడినాన్, ఇవనుక్కు నల్ల ఎదిర్కాలం ఇరుక్కు."

"రొంబ పెరియవనా వరువాన్"

("అద్భుతం..చాలా బాగా పాడాడు.. వీడికి మంచి భవిష్యత్తుంది.."

"ఇతను చాలా ఉన్నత స్థాయికి వెళతాడు")

అని అదే వ్యక్తి దీవించాడు.

ఆ యువకుడికి కాస్త అర్థమైందో, లేక అతని చూపులను పసిగట్టాడో అతనికి సంస్కారంగా నమస్కరించి బయటకు వచ్చేసాడు. సంతోషం, ఉద్విగ్న క్షణాలను తన కన్నవారితో స్నేహితులతో పంచుకునేందుకు పరుగెత్తాడు. అతడే ఇప్పటికి నలభై వేల పైచిలుకు పాటలు అలవోకగా పాడిన మన బాలసుబ్రహ్మణ్యం. ఘంటశాల వెంకటేశ్వరరావు గారు, పి.బి శ్రీనివాస్ గారు లాంటి మాహామహులు తెలుగు సినీలోకంలో సినీనేపథ్య వేదికను ఏలుతున్న సమయంలో నేపథ్య గాయకునిగా రంగప్రవేశం చేశాడు బాలు. ఆ తర్వాత వెనుదిరిగి చూసింది లేదు. వందలాది అవార్డులు, సన్మానాలు ఆయననే వెదుక్కుంటూ వచ్చాయి. ఆ సమయంలోనే బాలు ఒక మ్యూజిక్ ట్రూప్ ని మద్రాసులో నిర్వహిస్తుండేవారు. ఆ ట్రూప్ లోనే ప్రఖ్యాత సంగీత దర్శకులు ఇళయరాజా కీబోర్డ్ ప్లేయర్ గా సహకారం అందించే వారు. తనకు నేపథ్య గాయకునిగా పునర్జన్మను అందించిన సంగీత దర్శకులు కోదండపాణిని, నిర్మాత పద్మనాభాన్ని బాలూ తలచుకోని వేదికుండదంటే అతిశయోక్తి కాదు. బాలు తాను నిర్మించుకున్న రికార్డింగ్ థియేటర్ కు కోదండపాణి అని పేరు పెట్టుకొని ఆయనపై ఉన్న గురు భక్తిని చాటుకున్నారు. జానకి, సుశీల, ఎల్ ఆర్ ఈశ్వరి, ఎస్.పి. శైలజ, చిత్ర వంటి హేమాహేమీలతో, పలువురు వర్ధమాన గాయనిలతో యుగళగీతాలు ఆలాపించారు బాలు.

## జాతీయ అవార్డులు

దక్షిణభారతదేశం లోని తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఆలాపిస్తూ, ఏక్దూజేకేలియే వంటి హిందీ చలన చిత్రంలో పాటలుపాడి భారతదేశంలోని వేలాది మంది ప్రేక్షకులను తన అభిమానులుగా మార్చుకున్న గానకోకిల బాలసుబ్రహ్మణ్యం.

– 1979 లో శంకరాభరణం (తెలుగు) చిత్రంలో కెవి మహదేవన్ సంగీతంలో ఓంకారనాదాను సంధానమౌ గానమే గానానికి జాతీయ అవార్డును అందుకున్నారు బాలు.

– 1981 లో ఏక్ ధూజే కేలియే (హిందీ)లో లక్ష్మీకాంత్ ప్యారేలాల్ స్వరపరచిన తేరా మేరా బీచ్ మె కైసాహెయె బంధన్.. పాటకు జాతీయ అవార్డు బాలుని వరించింది.







– 1983లో సాగరసంగమం (తెలుగు) చిత్రంలో ఇళయరాజ స్వరపరచిన తకిటతధిమి తందాన పాటకు గానూ, జాతీయ అవార్డు తన ఖాతాలో వేసుకున్నారు బాలు.

– 1988లో రుద్రవీణ(తెలుగు) చిత్రంలో ఇళయరాజా స్వరపరచిన "చెప్పాలని ఉంది..." పాటకు,

1995 లో జ్ఞానయోగి పంచాక్షర గావయి (కన్నడ) చిత్రానికి గాను హంసలేఖ స్వరపరచిన ఉమ్మందు... గుమ్మందు పాటకు, 1996 లో మిసరకన్నవు (తమిళ) చిత్రంలో ఎ.ఆర్.రహమాన్ సంగీత సారధ్యం వహించిన "తంగా తమరై మాగలే" పాటకు జాతీయ అవార్డులను సొంతం చేసుకున్నారు ఎస్.పి.బాలు.

ఏకబిగిన పదిహేడు పాటలు ఉదయం 9 గంటల నుండి– రాత్రి 9 గంటల వరకూ కన్నడంలో సంగీత దర్శకుడు ఉపేంద్ర కుమార్ కోసం పాడారు.

తెలుగు, తమిళ్ లలో ఒకే రోజు 19 పాటలు రికార్డింగ్ కోసం సంగీత దర్శకులైన ఆనంద్ మిళింద్ కోసం ఆలాపించిన సినీ గాంధర్వుడు బాలు. సినిమా రికార్డింగ్ అయిన పాటల్లో అత్యధికంగా పాటలు పాడిన ఒక వ్యక్తి గా ఎస్.పి.బి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ స్థాపించారు. మహిళల్లో ఇది కూడా భారతీయుల పేరిటే వుంది. ఆవిడే ప్రముఖ బాలివుడ్ గాయని లతా మంగేష్కర్.

## అవార్డులు రివార్డులు

ఇక మన బాలూని అవార్డులు రివార్డులు లెక్కలేనన్ని వరించాయ్.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాలు 17 సార్లు, కర్నాటక రాష్ట్ర పురస్కారాలు 3సార్లు,

తమిళనాడు రాష్ట్ర పురస్కారాలు 3 సార్లు బాలసుబ్రహ్మణ్యం అందుకున్నారు.

## సంగీత దర్శకునిగా...

సంగీత దర్శకునిగా బాలు 45 చిత్రాలకు పైగా తెలుగు,తమిళ, కన్నడ, హిందీ లలో పని చేశారు. నేపథ్య సంగీతం అందించిన మయూరి చిత్రానికి ఉత్తమ సంగీత దర్శకునిగా బంగారు నంది అందుకున్నారు ఎస్.పి. ఆయన





స్వరపరచిన మధురసాలలో పడమటి సంధ్యారాగం చిత్రంలో అన్ని పాటలూ ఒకదానికి మించి మరొకటి! అందులో "పిబరే రామరసం" ఒకటి.

## నిర్మాతగా...

నిర్మాతగా దక్షిణాది భాషలన్నింటిలో ఆయన చిత్రాలు నిర్మించారు. విశ్వనాథ్ దర్శకత్వంలో కమల్ హసన్ నటించిన శుభసంకల్పం ఆయన నిర్మించిందే..! ఆశించినంత లాభాలు రాకున్నా.. అజరామరంగా నిలిచిన చిత్ర రాజం అది. తను స్వరాలకు అవార్డు నందుకున్న మయూరి చిత్ర అనువాదాన్ని తమిళ్‌లో ఆయనే నిర్మించారు.

## నటుడిగా ...

నటుడిగా ఎన్నో చితాలలో నటించి మెప్పించారు బాలు.

తెలుగులో ప్రేమికుడు తమిళ కాదలన్‌లో ప్రభు తండ్రిగా నటించి, తండ్రి అంతే ఇలా వుండాలనిపించి, అనేక మంది కొడుకుల మనసు దోచారాయన.

విదేశాల సంస్కృతి వంటబట్టిన వెంకటేష్‌కు పెళ్ళి చేసేందుకు ఆరాటపడ్డ తండ్రిగా పవిత్రబంధం చిత్రం లో బాలు అసమాన అద్వితీయ నటనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెచ్చి బంగారు నంది అందించి తనను తాను సత్కరించుకుంది.

తనికెళ్ళ భరణి గారి మిధునం చిత్రంలో సీనియర్ నటీమణి లక్ష్మి గారితో కలిసి చేసిన బాలు నటన అల్టిమేట్ అనే చెప్పాలి.

## యాంకర్‌గా...

బుల్లితెర యాంకర్‌గా, ప్రజెంటర్‌గా బాలు ఎన్నో విన్యాసాలు చేశారు.

సంగీతాలాపన చేయగలిగినవారు, మట్టిలో మాణిక్యాలు లాగా మిగిలిపో కూడదనే సత్సంకల్పంతో బాలు ఈ టివీ వేదిక గా 'పాడుతాతీయగా' కార్యక్రమం నిర్వహించారు. ఎందరో భావిగాయకుల గీత మాధుర్యాలను ఇటు ప్రేక్షకులకు, అటు సినీ ప్రపంచానికి అందించే యాగం నిరంతరం సాగించారు బాలసుబ్రహ్మణ్యం.

ఇప్పటికి వందలాది ఎపిసోడ్లు పూర్తయినా ప్రతి వారం టివీలకు అతుక్కునేంతగా చెరువయ్యారు బాలు. ఎందరో గాంధర్వులను వెలికి తీసి సాన బెట్టిన పరుసవేది ఆయన. 1.పాడుతాతీయగా (ఈటివి– తెలుగు)–250 ఎపిసోడ్లు పైగా

2. ఎందరో మహానుభావులు (జెమిని టివి – తెలుగు) – 73 ఎపిసోడ్లు

3. పాడాలని వుంది (మాటివి – తెలుగు) 300 పైగా 4.ఏధె తుంబి హాదువేను (ఈటివి – కన్నడ)–403

5.ఎన్నోడుపాట్టు పాడుంగళ్ (జయ–టివి– తమిళ్) 150

6.సునాద వినోదిని (ఎస్.వి.బి.సి– తెలుగు)– 49

7.ఘుమ్మంది నాదం (ఈటివి– తెలుగు) – 26

పలు భాషలలో పాటలు పాడే వారికోసం చిన్నారుల నుంచి పెద్దవారి వరకూ మాణిక్యాలను వెదికి ప్రపంచానికి పరిచయం చేశారు బాలు.

సినీ సంగీత వినీలాకాశంలో ధృవతారగా మిలమిల మెరుస్తూ కోట్లాది మంది ప్రేక్షకుల మదిలో గుడి కట్టుకున్న బాలసుబ్రహ్మణ్యం ఉరఫ్ బాలు గారు, అనుకోకుండా ఒక టివి షోలో కరోనా మహమ్మారి బారిన పడి, ఆసుపత్రి పాలయ్యారు. ఆయన క్షేమంగా తిరిగి రావా లని ప్రార్థించిన లక్షలాది మంది అభిమానుల ఆశలను వమ్ము చేస్తూ, 25 సెప్టెంబర్ 2020 న స్వర్గస్తులయ్యారు బాలు. ఆయన లేక పోయినా, ప్రతి తెలుగింటిలోనూ, తెలుగు గుండెలోనూ ఆయన పాటలు ఎప్పటికీ నిలిచే ఉంటాయి.

**– కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్**



# చలన చిత్ర సంగీత సామ్రాజ్యంలో
# సూర్య చంద్రులు

అది బహుశా 1971-1973 ల నడుమ అయివుంటుంది. మద్రాసులో టీ. నగర్ లోని ముప్పత్తమ్మ గుడి ఎదురుకుండా వీధి చివర కుడి వైపు మలుపు (కృష్ణ గాన సభ వెనుక వైపు రెండో వీధి) తిరగ్గానే రామచంద్ర అయ్యర్ వీధిలో ఎదురుగుండా (ఎడమవైపు) ఇంట్లో ఎస్. పీ. బాలసుబ్రమణ్యం గారు అప్పట్లో అద్దెకి వుండేవారు. ఆయన తమ్ముడు జగదీశ్ మాకు రామకృష్ణ మిషన్ బాయ్స్ హైస్కూల్, (టీ.నగర్)లో ఒక ఏడాది సీనియర్. అప్పుడప్పుడు వాళ్ళ వీధిలో మేమందరం క్రికెట్ ఆడేవాళ్ళం. ఒకసారి వాళ్ళ ఇంటి కాంపౌండ్ లోపల క్రికెట్ ఆడాం. నేను బాటింగ్ చేస్తుండగా కొట్టిన బంతి విసురుగా వెళ్లి వాళ్ళ ఇంటి యజమాని ఉంటున్న పోర్షన్‌లో కిటికీకి బలంగా తగిలింది. దెబ్బకి కిటికీ అద్దం పగిలింది. అదిచూసి గట్టిగా అరిచిన ఆ ఇంటి యజమాని గర్జనకి నేను బాటు కింద పడేసి వెనక్కి తిరిగి చూడకుండా పరుగు లంకించుకున్నాను. ఆ పరుగు నేను మా ఇంటి లోపలికి వచ్చేవరకు ఆగలేదు. ఆ తర్వాత దాదాపు రెండేళ్లవరకు నేను వాళ్ళ వీధి వైపు వెళ్ళలేదు. బాలు గారు తన తమ్ముడు జగదీశ్ ఎలా చదువు తున్నాడో కనుక్కోవటానికి అప్పుడప్పుడు మా తెలుగుమాస్టారు విద్వాన్ శ్రీ కోట సత్య రంగయ్య శాస్త్రి గారిని కలవటానికి మా స్కూల్‌కి వచ్చేవారు. మా తెలుగు మాస్టారు కోట సత్య రంగయ్య శాస్త్రి గారు అష్టావధాని. తిరుపతి వెంకట కవుల శిష్యులు. ఘంటసాలగారి భగవద్గీత సంస్కృత శ్లోకాలకి తెలుగు తాత్పర్యం వ్రాసారు.

11 ఫిబ్రవరి, 1974 యావత్ప్రపంచంలోని తెలుగువారినందరినీ విషాదానికి గురిచేసిన రోజు. ఆ రోజు ఘంటసాల గారు స్వర్గస్థులయ్యారు. తెలుగు చలన చిత్ర వినీలాకాశంలో నేపథ్యగాయకుడిగా, సంగీత దర్శకుడిగా మూడు దశాబ్దాల పాటు దివ్య తేజో భాస్కరుడిగా మకుటం లేని మహారాజుగా వెలుగొందిన ఘంటసాల గారి అస్తమయంతో చిత్ర పరిశ్రమ అంధకారంలో, విషాదంలో మునిగింది. ఆయన లేని వెలితిని ఎవరు తీర్చగలరన్న ప్రశ్న ఎదురైంది. చీకటి పడినప్పుడు సూర్యాస్త మయంతో పాటు చంద్రోదయం అయినట్టు బాలు శుక్ల పక్ష చంద్రుడిలా, తన చిరునవ్వుల వెన్నెలతో ఆశా కిరణంగా సినీ రంగానికి అగుపించారు. అందివచ్చిన అవకాశాలన్నిటినీ ఒడిసిపట్టుకుని, శాస్త్రీయ సంగీతంలో అభినివేశం లేనప్పటికి తన సంగీత సాధనతో పాండిత్యాన్ని పెంచుకుని ఎటువంటి పాటనైనా బాలు పాడగలడు అన్న ధైర్యాన్ని, నమ్మకాన్ని సినీ సంగీత దర్శకులకి, నిర్మాతలకి కలిగించాడు బాలు. ఘంటసాల గారిని అనుకరించకుండా, తనకంటూ ఒక ప్రత్యేక బాణీతో పాడటం ఒకవిధంగా బాలుకి వరంగా మారింది. వైవిధ్యంగా వున్న ఆ గాత్రం, బాణీ అచిరకాలంలోనే జనాదరణ పొందింది. శుక్ల పక్ష చంద్రుడు దినదిన ప్రవర్ధమానమైనట్టు బాలు బమ్మెర పోతన భాగవతంలో చెప్పినట్టు

**ఇంతింతై వటుఁడింతయై మరియుఁ దానింతై నభోవీథిపై**
**నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**
**నంతై చంద్రుని కంతయై ధ్రువుని పైనంతై మహర్వాటిపై**
**నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై**

అన్నట్టు 1980 నాటికి (చలన చిత్ర రంగానికి వచ్చిన 14 ఏళ్లలోనే) ముల్లోకాలకి వ్యాపించిన వామన మూర్తిగా, శంకరాభరణం చిత్రంలో శాస్త్రీయ సంగీతాన్ని ఆలపించి అటు పండితుల నుంచి, ఇటు పామరులనుంచి కూడా మెప్పు పొందాడు. 1966 లో బాలు గాయకుడిగా సినీ రంగప్రవేశం చేసినప్పుడు పిట్ట కొంచం, కూత ఘనం అన్న వాళ్ళు, కూత ఘనం, పిట్ట కూడా ఘనం అని శ్లాఘించడం మొదలుపెట్టారు. 1966 లో పీలగా ఉండే బాలు 1980 నాటికి బొద్దుగా తయారై వారి పొగడ్తలు సబబే అనిపించాడు. స్వతహాగా మిమిక్రీ లో ప్రావీణ్యం ఉండటం వల్ల వివిధ నటులకి పాడినప్పుడు వారి హావభావాలకి, వారి గాత్రాలకి అనుగుణంగా పాడటం అలవరచుకున్నాడు బాలు. దానితో నిర్మాతలు సినీదిగ్గజాలైన రామారావు, నాగేశ్వర రావు గార్లకి కూడా బాలు చేత పాడించటం ప్రారంభించారు. ఆ చిత్రాలు నటనా పరంగానే కాకుండా పాటల పరంగా కూడా ప్రజాదరణ పొందాయి.

శ్రీ టీ.వీ.కే. శాస్త్రి గారి మద్రాసు తెలుగు అకాడెమీ సాంస్కృతిక కార్యక్రమా లలో గౌరవ ఉపాధ్యక్షులుగా బాలు చురుకుగా పాల్గొనేవారు. కార్యక్రమ నిర్వాహక బృందంలోని ఒక సభ్యుడిగా నాకు అప్పుడు బాలు గారి సమయస్ఫూర్తి, హాస్యం, ప్రేక్షకులని ఆకట్టుకునే తీరు, ఎదిగినకొద్దీ ఒదిగివుండే సంస్కారం ప్రత్యక్షంగా చూసే అవకాశం చాలాసార్లు కలిగింది. అప్పట్లో శంకరాభరణం చిత్రం విడుదలై బాగా ప్రజాదరణ పొందడంతో మా అకాడెమీ కార్యక్రమాలలో పాడినప్పుడు శంకరాభరణం లోని పాటలు బాలు గారు తప్పనిసరిగా పాడేవారు.

ఏ భాషలో పాడినా పాడేటప్పుడు భాషోచ్చారణ లో స్పష్టత, భావవ్యక్తీకరణకి పరిపూర్ణ న్యాయం చేకూర్చేవారు బాలు. ఒక గాయకుడిగా సంగీతంతో పాటు సాహిత్యానికి కూడా సమన్యాయం చేసిన గొప్ప గాయకుల జాబితాలో బాలు ఒకరు. ఏక సంతాగ్రాహి అయిన బాలు సంగీత దర్శకుడు అల్లిన బాణీని వెంటనే ఆకళింపు చేసుకుని పాట రికార్డింగ్‌లో సింగల్ టేక్‌లో పాటని పూర్తి చేసివారు. దానితో బాలు తో పాడిస్తే ధన వ్యయం తగ్గుతుందని నిర్మాతలు, సమయం వృధా కాదనే ధీమా సంగీత దర్శకులకి, వాద్య కళాకారులకి కలిగేది. దీనికి తోడు ఆర్కెస్ట్రా తో విడిగా, గాయకులతో విడిగా పాడించి ఆ రెండింటినీ మిక్సింగ్ చేసే సాంకేతిక పరిజ్ఞానం అప్పుడే కొత్తగా రావటం బాలుకి నల్లేరు పై బండి నడకలా మారి ఆయన స్పీడ్ మరింత పెరిగింది.

కన్నడంలో ఉపేంద్ర కుమార్ గారి సంగీత సారధ్యంలో ఫిబ్రవరి 8, 1981న బాలు ఉదయం 8 గంటలనుండి రాత్రి 8 గంటలవరకు ఏకధాటిగా 21 పాటలు పాడి రికార్డు సృష్టించారు. క్రమేపీ రోజుకి కనీసం పది పాటలనుంచి ఇరవై పాటల వరకు పాడటం ఆయనకి సాధారణంగా మారింది. బాలు తన 54 ఏళ్ల సంగీత ప్రస్థానంలో దాదాపు నలభై వేల పాటలు పాడారంటే సగటున రోజుకి రెండు పాటలచొప్పున నిరంతరాయంగా పాడితే కానీ ఒక గాయకుడికి అది సాధ్యం కాదు. ఇది అనన్య సామాన్యం.

అదేవిధంగా బాలు అటు పాత తరానికి నవ తరానికి మధ్య ఒక పెద్ద వారధిలా నిలిచారు. ఆ నాటి గాయనీ గాయకులతో, సంగీత దర్శకులతో, పాటల రచయితలతో పాటు, ఈ తరం వారితో కూడా యావత్ దక్షిణ భారత చలన చిత్ర రంగంలో పనిచేసిన వేళ్లల్లో లెక్కించదగిన గాయకులతో బాలు ఒక్కరు. బహుశా ఇదికూడా ఖచ్చితంగా ఒక ప్రపంచ రికార్డు అవుతుంది. పరభాషలలో కూడా పరకాయ ప్రవేశం చేసి ఆయా భాషల ప్రజలనుంచి మన్ననలు అందుకున్న తెలుగు కళాకారులలో నటీనటులు భానుమతి, సావిత్రి, ఎస్. వీ. రంగారావు, గాయనీ గాయకులలో సుశీల, జానకి, ఘంటసాల, పీ.బీ. శ్రీనివాస్, బాలు తొలి వరుసలో నిలుస్తారు.

జనవరి 12, 1996న ప్రారంభమైన ఈ టీవీ వారి పాడుతా తీయగా కార్యక్రమానికి సూత్రధారిగా గాయకులవాలనే అభిలాష గలిగి, మంచి గాత్రం వున్నవారిని వెతికి మరీ పట్టుకుని, వారిని ప్రజలకి, సినీప్రపంచానికి పరిచయం చేసిన ఘనత బాలు గారిదే. బాలు చలవ వల్ల అనేకమంది నవతరం గాయనీ గాయకులు చలన చిత్ర రంగానికి వచ్చి, వారిలో చాలామంది ఈ రోజు ప్రజాదరణ పొందారు. ప్రధానంగా ఆ పాటల పోటీ కార్యక్రమంలో పాల్గొన్నవారికి బాలు ఇచ్చిన సూచనలు, మెలకువలు, సలహాలు కోకొల్లలు. 25, సెప్టెంబర్, 2020 న దివంగతులైన బాలు గారు ఇవాళ మన మధ్య భౌతికంగా లేకపోయినా ఈ పాడుతా



తీయగా రికార్డెడ్ ఎపిసోడ్స్‌ని మరల ఈ టీవీ వారు ప్రసారం చేస్తే కొన్ని వందలమంది బాలు గారికి ఏకలవ్య శిష్యులు ఆయన మరణానంతరం కూడా తయారవుతారని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఒక వర్ధమాన గాయకుడు తన గాత్రానికి తగినట్టు స్వంత బాణీని అలవరచుకుని, ప్రముఖ గాయకులని స్ఫూర్తిగా తీసుకుని వారిని అనుసరించినప్పటికీ పూర్తిగా అనుకరణ మాత్రం చెయ్యరాదన్నది బాలు గారి జీవితం నుంచి వర్ధమాన గాయకులు ముఖ్యంగా నేర్చుకోదగ్గ విషయం. పాట పాడేటప్పుడు సంగీతంతో పాటు సాహిత్యానికి తగిన ప్రాధాన్యత ఇచ్చి, ముఖ్యంగా ఉచ్చారణ స్పష్టంగా వుండేటట్టు, నోరారా నాభి నుంచి నాదాన్ని పలికిచడం, పాటని కేవలం రాగయుక్తం గానే కాకుండా భావయుక్తంగా పాడటం, ఇవి బాలు వర్ధమాన గాయకులకు అడగకుండానే బోధించిన పాఠాలు.

గాయకుడిగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి నటుడిగా, సంగీత దర్శకుడిగా, నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా , టీవీ ఏంకర్‌గా ఆరు పాత్రలతో షణ్ముఖ సుబ్రమణ్యంగా తన విశ్వరూపాన్ని ప్రజలకి ఆవిష్కారం చేశారు బాలు.

తెలుగువారికి ఘంటసాల భగవద్గీత ప్రసాదించి భగవత్సాన్నిధ్యం పొందితే, బాలు లింగాష్టకం ప్రసాదించి శివుడి సన్నిధికి వెళ్ళాడు. తెలుగువారి అదృష్టవశాత్తు నారద తుంబురులు ఘంటసాల, బాలు రూపాలలో భారతదేశంలో జన్మించిన అవతారపురుషులు, కారణం జన్ములు. తెలుగు చలనచిత్ర సంగీత సామ్రాజ్యంలో సూర్యచంద్రులుగా వెలిగిన వీరిద్దరికీ మన తెలుగు రాష్ట్రాలు ఇప్పటికైనా చొరవ తీసుకుని భారత ప్రభుత్వం ద్వారా "భారత రత్న" పురస్కారాన్ని ప్రకటిస్తే ఆ పురస్కారానికి వన్నె తెచ్చినట్టు అవుతుంది. ఆ దిశగా మన రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తారని, ఈ ఇద్దరు మహానుభావుల పేరిట మన తెలుగు రాష్ట్రాలలో త్వరలోనే సంగీత విశ్వవిద్యాలయాలు నెలకొల్పుతారని ఆశిద్దాం.

– డాక్టర్. బీ.యస్.వీ. పార్థసారథి



*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**


# వడ్డాది కూర్మనాధంగారు



వడ్డాది అంటే చాలామంది వడ్డాది పాపయ్య గారనుకుంటారు, ఈ వడ్డాదిగారు రచయిత ఒకరకంగా మాకు ఆయనతో చుట్టరికం కుడా వుంది. మా బాబయ్యగారికి అన్న గారు, మా బాబయ్యగారు రచయితే నాలుగు పుస్తకాలు రాశారు, ఆయన పేరు వడ్డాది సత్యనారాయణ మూర్తి. ఇక వడ్డాది కూర్మనాధంగారు చాలా చాలా నిదానస్తులు. నెమ్మదిగా మాట్లాడే వారు. నుదుట తిలకం పెట్టుకునే వారు. ఖద్దరు లాల్చీ వేసుకునేవారు. మాటల మధ్యలో జోకులు వేసేవారు. విజయనగరానికి చెందిన వడ్డాదిగారు 1950 దశకంలో సినీ పరిశ్రమకొచ్చారు. కొన్ని డబ్బింగ్ చిత్రాలలో ఆయన పేరు కె. వడ్డాది అని వేశారు.

ఇలవేల్పు (1956) చిత్రంలోని చల్లనిరాజా ఓ చందమామ, పాటని ఈరోజుకి మరిచిపోని సంగీతాభిమానులున్నారు, విజయనగరంకి చెందిన వడ్డాది 1950 ప్రాంతాలలో సినీ పరిశ్రమకు వచ్చారు. ఇలవేలుపులో సుసీల, లీల, రఘునాథ్ పాణిగ్రాహి పాడిన "చల్లని రాజా ఓ చందమామా" పాట ద్వారా పాపులర్ అయ్యారు. తర్వాత చాలా డబ్బింగ్ సినిమాలకు పాటలు వ్రాసారు. కాలాంతకుడు, బాగ్దాద్ గజదొంగ, పాపాల భైరవుడు, హంతకుడెవరు, మారని మనసులు, కత్తిపోటు, మా అన్నయ్య, అంతులేని హంతకుడు, దెబ్బకు దెబ్బ, మేమే మొనగాళ్ళం వంటివి కొన్ని. కొన్ని అనువాద చిత్రాలకు ఆయన పేరు వడ్డాదికేగా వుంది, అంటే వడ్డాది కూర్మనాధం అని. 1971 తరువాత ఆయన రాసిన సినిమాలేవిటనే సమాచారం అందుబాటులో లేదు.

ఆయన రాసిన పాటలలో ఇలవేల్పు సినిమాలోని "చల్లని రాజా ఓ చందమామా..." బాగా ప్రసిద్ధి చెందింది అప్పట్లో. ఈ చిత్రం 1956 ప్రాంతంలో వచ్చింది. ఆయనే 1966 లో విడుదలైన పాదుకా పట్టాభిషేకానికీ మాటలూ పాటలూ రాశారు.

తెలుగు సినీ చరిత్రలో పాదుకా పట్టాభిషేకం సినిమా మొదటిసారిగా 1932లో నిర్మించారు. ఈ చిత్రంలో సురభి కమలాబాయి, అద్దంకి శ్రీరామమూర్తి ప్రధాన పాత్రలు పోషించారు. మరో పదమూడేళ్ళకు అనగా 1945లో శ్రీ రాజరాజేశ్వరి ఫిలింస్ పతాకంపై కడారు నాగభూషణం, 'పాదుకా పట్టాభి షేకం' చిత్రం రూపొందించారు. పుష్పవల్లి, సియస్ఆర్, కన్నాంబ, బందా కనకలింగేశ్వర రావు, అద్దంకి శ్రీరామమూర్తి తదితరులు ఈ చిత్రంలో నటించారు.

ఆ తరువాత వసంత కుమార్‌రెడ్డి దర్శకత్వంలో 1966లో పాదుకా పట్టాభిషేకం మళ్ళీ తీసారు. వడ్డాదిగా పేరుపొందిన రచయిత బుచ్చి కూర్మనాథం ఈ చిత్రానికి సాహిత్యం అందించారు. వాల్మీకి మహర్షి చిత్రాన్ని ప్రముఖంగా చూపుతూ వాల్మీకి రామాయణం ఆధారంగా ఈ చిత్రం తీశారు. ఈ చిత్రంలో సందర్భోచిత పద్యాలను ఘంటసాల, రాఘవులు, పి.బి. శ్రీనివాస్, ఎస్ జానకి ఆలపించారు.

"చల్లని రాజా ఓ చందమామా..." ఒకటి. అది రాసింది వడ్డాది బుచ్చికూర్మనాథంగారే. అయితే ఇటీవల అంతర్జాలంలో చూడగా శ్రీశ్రీగారు ఆ పాట రాసినట్టు ఉంది. కానీ కొన్ని చోట్ల వడ్డాదిగారు రాసినట్లే ఉంది. నేను గ్రామఫోన్ రికార్డుమీద చూసినట్లు గుర్తు. ఎందుకో నాకు ఆ పాట, వడ్డాదిగారు గుర్తుకొచ్చారు. ఆయనకు నేనంటే అభిమానం మెండు, మా ప్రెస్ వుంటున్న పాత మాంబళం లోనే వారి ఇల్లు వుండేది, చాలా రోజులు సాయంకాలాలు మా ప్రెస్ కొచ్చి మాట్లాడుతూ వుండేవారు. ఆయనో పెద్ద సాహిత్య స్రష్ట నాదేమో మిడి మిడి జ్ఞానం, అయినా మా సంభాషణం గంటా రెండు గంటలు సాగేవి. ఆయన గురించి నాకు తెలిసున్నంతమేరకు మీకు అందించాను.

– గోటేటి వెంకటేశ్వరరావు

# జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించిన తొలి తెలుగువాడు

# ఆనందాచార్యులు

ఎన్నాళ్లగానో భద్రంగా దాచుకున్న పాత పుస్తకం, ఆచూకీ తెలియనివారు పట్టుకునిపోతే ఏలా వుంటుందో, చెన్నపట్నంలో చరిత్రను సృష్టించిన తెలుగు ప్రముఖుల చరిత్ర, భూగోళం నుంచీ తొలిగిపోతుండంలో బాధగా ఉంటుంది. భారతీయులంతా ఒక్కటేననీ, ఒక్కటే జాతియనీ, ఒక్కటే సంస్కృతియనీ, భారతీయ వైభవాన్నీ, శోభనూ చాటిచెప్పినవాడు వ(ర్థ)ర్తమాన చరిత్రలో కరువవుతున్నాడు. బిళ్లగోచీ పంచెకట్టి, తెల్లటి లాల్చీపైన నల్లటి కోటును ధరించి, దర్పంగా, దరహాసంతో తెల్లటి తలపాగాను చుట్టిన తెలుగు న్యాయవాదులు 'సత్యమేవ జయతే' అంటూ నిస్స్వార్థంగా దేశసేవను చేసి తెల్ల దొరలను మెప్పించిన వారెందరో ఎందరో ఉన్నారు. వారిదెందము నంతా దేశ ప్రియత్వమే! వారి తనువంతా భారత సంస్కృతీ శోభే!

తమిళులకు నోరుతిరగకనో, ఏమో ఆ అనంతాచార్యులు నామాన్నీ ఆనందా చార్యులుగా మార్చేశారు. ఆయన పట్ల ఆనందం చెంది అలా పేరును మార్చేశా రేమో!

అది 1891వ సంవత్సరం. మహారాష్ట్రలోని నాగ పూర్‌లో పదవ జాతీయ కాంగ్రెస్ మహాసభ జరిగింది. ఎందరెందరో, ఎన్నో ప్రాంతాల నుంచీ వచ్చిన పెద్దలు ఆ జాతీయ కాంగ్రెసు మహాసభలో పాల్గొన్నారు. 48 సం॥రాల వయసు కల ఓ మధ్యతరగతి యువకుడు, వైష్ణవ బ్రాహ్మణుడు – అందునా చెన్నపట్నంనుంచీ వెళ్లిన ఆంధ్రుడు అధ్యక్ష పీఠానికి ఎన్నిక కావడం, అందరి కరతాళ ధ్వనులందు కోవడం విశేష మైంది. ఆయనే మనప్పాకం అనంతాచార్యులు, ఆనందాచార్యులుగా చరిత్ర కెక్కినవాడూ ఆయనే!

చిత్తూరు జిల్లాలోని కడమంచి గ్రామంలో 1843 సం॥ము ఆగష్టు నెలలో జన్మించారు. తండ్రి శ్రీనివాసాచార్యులు, చెంగల్పట్టు జిల్లా పొన్నేరి తాలూకా వన ప్పాకం గ్రామం వారు. అందుకే వనప్పాకం ఇంటి నామంగా వ్యవహరించబడింది. బాల్యంలో ఆయనకు దురదృష్టమూ, అదృష్టమూ రెండూ కలిసివచ్చాయ్. దుర దృష్టం పన్నెండవ ఏటనే తండ్రి పరమపదించడం, అదృష్టం చదువుకు అంతరాయం కలుగకుండా తండ్రి స్నేహితుడు రంగనాథ శాస్త్రి చేయూత కారణంగా చదువు కొనసాగడం. మెట్రిక్యులేషన్ పరీక్షనందుత్తీర్ణుడై, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఇంటర్మీడియేట్ పూర్తిచేయడం, తోడుతనే పచ్చయప్ప కళాశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసే అవకాశం కలుగడం, వరుసగా వెల్లువగా వచ్చాయ్. ఉపాధ్యాయ వృత్తి అంత సంతృప్తికరంగా లేకపోవడంతో, బి.ఎల్. చదివి, మద్రాసు హైకోర్టులో న్యాయవాది వృత్తిని చేపట్టడంతో ఆయన జీవితమే మారిపోయింది. న్యాయ వాదుల్లో గొప్ప న్యాయవాదిగా పేరు పొందారు. అప్పుడాయనలో ఓ రచయిత కూడా ప్రవేశించాడు. దానితో ఆయన రెండు గ్రంథాల్ని వ్రాశాడు. ఒకటి మన దేశాన్ని ఏవిధంగా సంస్కరించుకోవాలి, రెండవది 'న్యాయవాద వృత్తి'. ఈ రెండు గ్రంథాలూ ఆయన్ను ఎంతో ప్రాచుర్యంలోకి తెచ్చాయ్.

ఇటు న్యాయవాద వృత్తిలో తీరిక లేకుండా ఉంటూనే – సాంఘిక సేవా కార్యక్రమాల్లోకి ప్రవేశించారు. 1880 సం॥ములో 'మద్రాసు నేటివ్ అసోసియే షన్'కు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. తిరువళిక్కేణిలో నెలకొన్న లిటరరీ సొసైటీకి అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. 1884 సం॥ములో మద్రాసు మహాజన సభకు అధ్యక్షులయ్యారు. స్థానిక ప్రజలు ముఖ్యంగా విద్యావంతుల సమస్యలను బ్రిటిష్ ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తూ, పరిష్కరించే విషయంలో కడుశ్రద్ధను వహించేవారు. ఇండియన్ సివిల్ సర్వీసు పరీక్షలను, లండన్‌లోనూ భారతదేశం లోనూ ఏకకాలంలో జరిపించాలని నిరంతర కృషి చేశారు.

బ్రిటీష్ ప్రభుత్వం ఆనందాచార్యులవారి న్యాయ శాస్త్ర నిపుణతను గుర్తించడమే గాకుండా పెద్ద ఎత్తున గౌరవించింది. 1887 సం॥ములో విక్టోరియా మహారాణి పాలనా స్వర్ణోత్సవ సంవత్సరం. ఆ సందర్భంలో ఆనందాచార్యులుకు రావు బహ ద్దూర్ బిరుదమును ప్రసాదిస్తూ, సి.ఇ.సి. బిరుదము కూడా ప్రదానం చేసింది.

1885 సం॥ము నుంచీ 1899 సం॥ము వరకూ ఆయన మద్రాసు కార్పొరేషన్ సభ్యునిగా అందరి మన్ననలూ అందుకున్నారు. 1892 సం॥ములో భారతీయ సమితుల చట్టం అమల్లో ఉన్నప్పుడు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ షా మెహతా, గోపాలకృష్ణ గోఖలే, రాస్ బిహారీ బోస్, జి.ఎం. ఫత్నవీస్ విశ్వంభరదాస్, మహ్మద్ రహంతుల్లాతో బాటు ఆనందాచార్యులు గారు కూడా సభ్యులుగా ఉన్నారు. ఆ సభ్యత్వం అలాగే ఎనిమిది సంవత్సరాల పాటు కొనసాగింది.



ఆనందాచార్యులుగారు మంచి వక్త. నిర్భయంగా నిర్మొహమాటంగా ప్రజల పక్షాన మాట్లాడకలిగే ధీమంతుడూ ఆయనే. తెలుగువాని గానే గాకుండా దక్షిణాది వానిగా ప్రముఖ పదవులను నిర్వహించిన నాయకుడే ఆయన. ఆరోజుల్లో అధ్యక్ష పదవిని నిర్వహించిన వారు తదనంతరం కార్యదర్శులుగా పనిచేసేవారు. అలా ఆయన 1893 సం॥ ములో లాహోర్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శిగా తన బాధ్యతల్ని నిర్వహించి, మంచి పేరును గడించారు.

ఆనందాచార్యులుగారు రాజకీయ రంగంలోనే గాకుండా సాహితీ రంగంలో కూడా చక్కటి రచయితగా రాణించారు. ఆయన సంస్కృత పాండిత్యాన్ని ప్రశం సించిన నవద్వీప పండిత పరిషత్తు వారు ఆయనకు 'విద్యా వినోదిని' బిరుదును ప్రసాదించారు. ఇలా రాజకీయ సేవలోనూ, సాహితీ సేవలోను వచ్చిన బిరు దములనూ, సత్కారములనూ వివరించాలంటే – ఓ అష్టోత్తర శత దండకమే అవుతుంది. ఆయన ఆంధ్ర మహాభారతంపై 'శంతన పౌత్రుల ప్రభుత్వం' అనే వ్యాఖ్యానమును వ్రాశారు. 'మంజువాణి' విజయం అను గ్రంథాలను రచించారు. 'వైజయంతి' అనే మాసపత్రికను నడిపారు. పత్రికా రచయితగా, పత్రికా సంపాదకునిగా పత్రికా రంగంలో కూడా తనదైన శైలిని కనబరిచారు. ఆనాటి తెలుగు న్యాయవాదులు దేశసేవా పరాయణులేగాకుండా, పత్రికా రచయితలూ, పత్రికా సంపాదకులూ, పత్రికా సారథులని కూడా ప్రకాశం పంతులు, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, ముద్దూరి అన్నపూర్ణయ్య వంటి వారెందరో ఆ మార్గాన నడిచి ఋజూపరిచారు.

అనంతాచార్యులవారు ఎక్కువకాలం ఆంధ్ర ప్రదేశా ల్లోనే ఉండడం వలన ఆయన పేరుకాస్తా ఆనందా చార్యులుగా స్థిరపడిపోయింది. భారత రాజకీయాల్లో ఉన్నప్పటికినీ – ఆయన మద్రాసు మకామును వీడలేదు, ఎక్కడకూ వలసపోలేదు. ఎన్నో రంగాల్లో ప్రఖ్యాతి గాంచి, ఎందరెందరి పెద్దల మనస్సుల్లో రంజింపజేసి, ఎంతో ఉన్నతస్థాయికి చేరిన వనప్పాకం ఆనందాచార్యులుగారు తన 65వ ఏట అనగా 1908 సంవత్సరం నవంబర్ 28న వైష్ణవసాయుజ్యం చెందారు. అలాటి తెలుగు తేజోరాశికి వందన శతముందించడం 'ప్రముఖాంధ్ర' తన బాధ్యతగా తలపోస్తూంది. ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# అడుగడుగునా ఆంధ్రుల ఆత్మగౌరవం అంటూండే ఆంధ్ర నాయకులు జెండా శిల్పి పింగళి వెంకయ్యపై ఏవి గౌరవం వలకించారు!



## ఆత్మగౌరవం మాటల్లోనేనా - చేతల్లో ఉండదా!

జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య తెలుగువాడు కావడమో, మరే కారణమో – ఆయనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మూలకంగా గానీ, జాతీయ రాష్ట్ర నాయకుల మూలకంగాగానీ జరుగవలసిన గౌరవం జరగలేదన్నది పదహారణాల సత్యం.

ఇటీవల 'వార్త' స్వాతంత్ర్య దినోత్సవ సంచికలో మా తాత జెండా తాత – మా ఊరికి కడుపుకోత' శీర్షికలో వారి మనుమ రాలు వ్రాసిన వ్యాసంలో వారి కుమార్తె సీతామహా లక్ష్మి వాపోవడం చదివాను. పింగళి వెంకయ్య వారసులంతా సాదాసీదాగానే బ్రతుకుతున్నారు. ఆయన కుమారులు ఇద్దరూ చనిపోగా, ఆయన కుమార్తె సీతామహాలక్ష్మి సజీవంగానే ఉంది. పింగళి వెంకయ్యగారి వారసుడు దశరథరామ్ విజయవాడలో హత్య కావింపబడ్డారు.

పింగళి వెంకయ్యగారి మనుమరాలు ఛాయా దేవి 'వార్తా విలేఖరి'తో మాట్లా డుతూ, తమ తాతగారిలానే తామూ నిరాడంబరంగా బ్రతుకుతున్నామనీ, ఎవరినీ ఏవీ కోరలేదనీ చెబుతూ, తమ తాతగారు ఏవీ ఆశించేవారు కాదనీ, తమ కుటుంబ సభ్యులందరూ అదే తరహాలో జీవిస్తూన్నా మనీ, చేయి చాచి ఎవరిని దేహీయని ఏవీ అడగలేదనీ చెప్పడం, విన్నవారికి హృదయ విదారకంగా ఉంది. ఆ మహాత్మునికి 'భారత రత్న'యైనా యిచ్చి గౌరవిస్తే – ఎంతో సమంజసంగా ఉంటుందనే అభిమతం వ్యక్తీకరించారు. ఎవరు సిఫార్సు చేసేవారు, ఎవరు యిచ్చే ట్టుగా చూచేవారు.

ఎవరికి వారు పదవుల్ని సంపాదించు కుందామనీ, ఆస్తులను కూడగట్టు కుందామనే వారే గానీ, ఇలాటి త్యాగధనులను గౌరవిద్దామనే సంకల్పం ఎవరికి కలుగకపోవడం శోచనీయం.

మాతృభాషా ప్రాచుర్యం, మాతృభాషా సంస్కృతీ సాంప్రదాయాలు, వనరుల అభివృద్ధి పట్టని నాయకులకు – ఇలాటి విషయాలు గుర్తుంటాయా?

శ్రీ వెంకటయ్యగారు కృష్ణాజిల్లా మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. ఆగ్రామం కూడా ఎదుగూబొదుగూ లేకుండా ఉంది. ఆ గ్రామంలోని అధిక జనులు పేదలే! వీరిలో కొందరికి 50 ఏళ్ల నాడు ప్రభుత్వం వారు ఇళ్ల స్థలాలు యిచ్చారు. గ్రామానికి వైద్యసదుపాయం మాత్రం లేదు. ఉన్నా ఒక ఆయుర్వేద ఆసుపత్రికి వైద్యుడు లేడు.

గ్రామాభివృద్ధిని సౌకర్యం చేసే నాధులు లేరు. సరియైన రోడ్డు లేవు. బస్సు సౌకర్యం లేదు. రహ దారి రాళ్లు లేచి, గోతులతో, గుట్టలతో అస్తవ్యస్తంగా ఉంది. రోడ్డుపై ముళ్ల పొదలు కూడా లేచాయ్. ఏదో ఒక బస్సు మొక్కుబడిగా నడుస్తూంది.

ఆ గ్రామంలోని వారికి పింగళి వెంకయ్య గారంటే అమిత గౌరవం. ఆ గ్రామంలోనైనా పాలకులూ, అధికారులూ ఆయనకో శిలావిగ్రహం నెలకొల్పుదామనే అభిప్రాయానికి కూడా రాలేదు. అది జూచి ఆ గ్రామానికి చెందిన చలసాని కుటుంబరావు, సావిత్రమ్మ దంపతులు 50 వేల రూపాయలు వెచ్చించి, గ్రామ ప్రధాన కూడలిలో పింగళి వెంకయ్యగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నివాళులర్పించడం జరిగింది.

వెంకయ్యగారు అగ్రజాతివాడు కావడమే ఏమో, దేశంలో ఎక్కడా ఏ గ్రామ కూడలిలోనూ ఆయన విగ్రహాలు కనపడవు. చాలామంది యువతరానికి ఆయన పేరే తెలియదు.

ఆయన ఒక జెండా శిల్పియే కాదు, ఆ జెండాను గురించీ ఓ గ్రంథం కూడా వ్రాశారు, గాంధీని మెప్పించారు. గాంధీ సూచనతో ఆయన మువ్వన్నె జెండా మధ్యలో రాట్నం గుర్తును వేశారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన అనన్తరం ఆ రాట్నం స్థానే అశోకచక్రం ముద్రించి, భారత జాతీయ అధికార పతాకంగా రూపొందించారు. అలాటి జాతీయ పతాక రూపకర్తగా జాతీయ గౌరవాన్ని పొందిన పింగళి వెంకయ్యకుగానీ, వారు పుట్టిన ఊరుకుగానీ, త్యాగధనులైన వారి కుటుంబానికి గానీ మనం ఏం చేశాం? ఆంధ్రుల ఆత్మగౌరవం అని చెప్పుకునే హక్కు మనకు ఉందా – యని సామాన్య వ్యక్తిగా చర్చించుకుందాం. ఇదే – ఏ తమిళుడో, బెంగాలీయో అయితే – ఊరూరా విగ్రహాలు నెలకొల్పి, జన్మదిన జయంతులు జరిపి, నీరాజనం యిచ్చేవారు. పాఠ్య గ్రంథాల్లోనూ, ఉపవాచకాలుగానూ ఆయనకో చరిత్రను సృష్టించేవారు. మరి మనం తెలుగువారం, మన తెలుగువారిని వెలుగులోనికి రానివ్వని వారం. భాషనే మాట్లాడనివారం, ప్రాచుర్యంలోనికి గొనిరాలేని వారం, తెలుగు వెలుగులనేఁవి వెలుగులోకి తెస్తాం. ●


# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 26 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 251, 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**


**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**

**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.**

**మొబైల్ : 98400 48941**



# 'చందమామ'ను చేరిన బొమ్మల తాతయ్య

ఇదివరలో తల్లులు పిల్లలకు చందమామను చూపించి గోరుముద్దలు తినిపించటమే కాదు, చందమామ పుస్తకం లోని బొమ్మలను చూపించి కథలు కూడా చెప్పేవారు. ఆ లేత మనసుల్లోని ఊహలకు బొమ్మలనే రెక్కలు తొడిగి, వారిని సుందర లోకాలకు తీసుకు వెళ్ళిన ఘనత చందమామ చిత్రకారులు శంకర్ గారికి దక్కుతుంది. 29 సెప్టెంబర్ 2020 నాడు స్వర్గస్థులైన చందమామ తాతయ్య శంకర్ గారితో గతంలో నేను జరిపిన ముఖాముఖి నుంచి, కొంత భాగాన్ని ప్రముఖాంధ్ర పాఠకుల కోసం పంచుతున్నాను.

ఆర్టిస్ట్ శంకర్ గారి అసలు పేరు కరత్తొలువు చంద్రశేఖరన్ శివశంకరన్. 1924లో తమిళనాడులోని ఈరోడ్‌లో వారు జన్మించారు. 1946 నుంచి ఆఖరి శ్వాసవరకు బొమ్మలే జీవితంగా గడిపారు. చందమామ పత్రిక అన్ని ప్రముఖ భారతీయ భాషల్లో వెలువడ్డంతో ఆయన దేశమంతా తెలిసిన కళాకారుడయ్యారు. చందమామలో బేతాళకథల బొమ్మలతో పాటు రామాయణం, మహాభారతం వంటి సీరియళ్ళకు, వేలాది కథలకు ఆయన బొమ్మలు వేసారు. అందరి కళ్లను కట్టిపడేసే శంకర్ గారి బొమ్మల్లోని ఘనత, బొమ్మనే కాదు, ఆ చిన్న బొమ్మ పరిసరాల్లో అతి సూక్ష్మమైన అంశాలను కూడా అద్భుతంగా గీయడం! వారి చిత్రకళా ప్రస్థానం గురించి వారి మాటల్లో...

"పదేళ్ల వయసునుంచే బొమ్మలు వేయడం మొదలుపెట్టాను. సొంత సాధనతో, పరిశీలనతో ఆ విద్యకు సాన పెట్టుకున్నాను. కంటికి ఇంపుగా కనిపించిన ఏ బొమ్మనయినా వేసేవాడిని. నాలోనే చిత్రకళా నైపుణ్యాన్ని పరిశీలించిన హై స్కూల్ టీచర్ నన్ను బాగా ప్రోత్సహించారు. ఇంటికి పిలిచి సలహాలిచ్చి 'బాబు నువ్వు ఆర్ట్ స్కూల్లో చేరాలి' అంటూ ప్రోత్సహించేవారు. ఆ మాటలు నా మనసులో ముద్రించుకుని పోయాయి. చాలా కష్టపడి ఒక బొమ్మ వేసి మద్రాస్ గవర్నమెంట్ ఆర్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కి చూపిస్తే, అయినా ఎంతో మెచ్చుకుని నన్ను నేరుగా రెండవ సంవత్సరంలోకి తీసుకున్నారు."

## తెలుగు సౌరభం

**కార్యగతుల తెఱగు కలరూపు చెప్పిన**
**అధిక మతులు వాని నాదరింతు,**
**రల్ప కార్యబుద్ధులగు వారలకునది**
**విరస కారణంబు విషమపోలె!**

సర్వసాధారణంగా బుద్ధిమంతుల కేది బోధించినప్పటికీ చెవినిపెట్టి వింటారు, ఆచరిస్తారు. అల్పబుద్ధికలవారూ, ఆకతాయిలూ ఉన్నారు చూడండి! – వారికేది బోధించినప్పటికీనీ పెడచెవిని పెట్టడానికే చూస్తారుగానీ ఆచరణ లోనికి రానీయరు.

పై పద్యాన్ని సూక్తిముక్తంగా వ్రాసిన ఆనాటి శ్రేష్ఠ కవిత్రయంలోని రాణ్మహేంద్రునివాసి నన్నయ భట్టారకుడు – తన శ్రేష్ఠ రచనయైన మహాభారతంలోని అరణ్యపర్వంలో ఏంవి వ్రాశారో చూశారా – కార్యగతులను గూర్చి వివేకవంతులు చెప్పగా అధికమతులు (బుద్ధిశాలులు) ఆదరించి ఆచరిస్తారుట. అల్ప కార్యబుద్ధులకు మాత్రం ఆ హితోక్తులు విషంలా కనిపిస్తాయట. అందుకే వారు దాన్ని త్రోసి రాజంటారు, అంతేకాదు, మంచి మాటలు చెప్పే కార్యగతుల మాటలు హితము కాకపోగా చెప్పినవారిని రాజ్యబహిష్కారం కూడా చేస్తారుట. తద్విధంగానే ధృతరాష్ట్రునికి పై పద్యం ద్వారా నీతిబోధ చేసిన విదురుడు రాజ్యబహిష్కరణ పొందాడు. పై పద్యం సారాంశం కూడా అంతే!

ధృతరాష్ట్రునికి కళ్లే కాదు, బుద్ధి కూడా గ్రుడ్డిదే! గ్రుడ్డితనాన్నీ, మనసు కుంటితనాన్నీ మాపుచేద్దామనీ, మంత్రివర్యుడైన విదురుడు అప్పుడప్పుడు కొన్ని హితోక్తులు చెప్పి – ఆయన వక్రమార్గ పయనాన్ని, సక్రమ పంథాపై నడిపిద్దామని చాలా తంటాలు పడతాడు. ధృతరాష్ట్రునికి అతని మంచి మాటలు (మధుర వాక్కులు) నచ్చవు. ఇలా కొన్నాళ్లుంటే విదురుడు తన్ను పూర్తిగా మార్చివేస్తాడని భావించాడో ఏమో, వెంటనే ఆయన్ను రాజ్యబహిష్కారం చేసి (నీ దిక్కున్నచోటకి పో – అంటూ) పంపించేశాడు.

అప్పుడాయన ఆకులూ, అలములూ చేదుకుంటూ, అడవులను దాటుకుంటూ పాండుసుతులను చేరుకున్నాడు. మంచిని సదా వాంఛించే పాండుసుతులాయనకు హృదయపూర్వకమైన స్వాగతాన్నిచ్చి హృదయానికి హత్తుకున్నారు. ఇది నన్నయ్యభట్టారకుని తెలుగు పద్యరచనా సౌరభం. అందుకే ఆయన్ను అది తెలుగు కవి యంటారు!

"చదువు పూర్తయ్యాక ఆరేళ్ల పాటు 'కలై మగళ్' అనే పత్రికలో పనిచేశాను. 1952 లో చక్రపాణి గారి ప్రోత్సాహంతో చందమామలో చేరాను. ఆ తర్వాత 60 ఏళ్లపాటు నాకు చందమామ నాలుగు గోడలు తప్ప మరేమీ తెలియదు. చక్రపాణి గారు, నాగిరెడ్డి గారు తమ ఉద్యోగులను కన్న బిడ్డల్లా చూసుకునే వారు. నోరు విప్పి చెప్పకపోయినా మా అవసరాలు తెలుసుకుని అన్నీ అందించేవారు. ఆ సంస్థ మాకు పుట్టిల్లు వంటిది. అందులో మా చిత్రకారుల కోసం ఒక పెద్ద గది ఉండేది. ఆ గదిలో మాకు కావలసినవి అందించడానికి కుర్రాళ్ళు ఉండేవారు. సాటి చిత్రకారులయిన వడ్డాది పాపయ్య గారు, చిత్ర గారు మా అందరి మధ్య ఒక ఆరోగ్యకరమైన పోటీ ఉండేది. 2013లో చందమామ మూసేసే దాకా నేను అందులోనే పని చేశాను. చందమామ మూతపడ్డాక 'రామకృష్ణ విజయం' అనే పత్రికలో బొమ్మలు గీశాను."

భావి చిత్రకారులకు మీరు అందించే సందేశం ఏమిటి అని అడిగినప్పుడు చాలా వినయంగా అంత గొప్ప వాడిని కాదు అని చెబుతూనే, ఇలా అన్నారు శంకర్ గారు.

"ఏ చిత్రకారుడైనా ఒక బొమ్మని అందంగా వెయ్యాలనుకున్నప్పుడు, అతడు ఆ బొమ్మగా మారిపోవాలి. ఉదాహరణకు శివుడి బొమ్మ వేయాలనుకున్నవారు తమను శివుడిగా ఊహించుకుంటే తప్ప ఆ బొమ్మలో జీవం కనిపించదు. వేసే బొమ్మ మీద ప్రేమ ఉండాలి ప్రేమతో చేసే పనిలో ఎటువంటి ఒత్తిడి ఉండదు."

97 ఏళ్ల 'చందమామ' తాతయ్య మంగళవారం వృద్ధాప్య సమస్యల కారణంగా చెన్నైలో తుది శ్వాస విడిచారు. వారు ఈ లోకాన్ని విడిపోయిన వారు వేసిన బొమ్మలు ఇప్పటికీ అందరి మనసుల్లో సజీవంగానే ఉంటాయి.

– భావరాజు పద్మిని




# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

**ఈలోకం ఎప్పుడు పుణ్యపాపాల, సుఖదు:ఖాల మిశ్రమం,**
**చక్రం పైకి కిందికి తిరుగుతుంటుంది.**
**జననమరణాలు అనేవి అనివార్యమైన విధి నిర్ణయాలు**

- స్వామి వివేకానంద



జననమరణాలు విధి నిర్ణయాలైనా కొందరి మరణం మనల్ని బాధిస్తుంది, మృత్యువుతో సుదీర్ఘ పోరాటం తరువాత తిరిగి వస్తారనుకున్న బాలు వెళ్ళిపోవడం జీర్ణించుకోలేకపోతున్నాను.

ఎస్పీ, బాలు, ఎస్పీబీ ఇలా అభిమానుల ఆత్మీయుల చేత పిలిపించుకునేంత ప్రేమ అభిమానం సంపాదించుకున్నారు మన శ్రీ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. ఎస్పీబీకి వున్న అసంఖ్యాక అభిమానులలో నేను ఒకడిని. ఇక్కడ నేను ఆయన రికార్డులు, అవార్డులు, రివార్డులు గురించి రాయటంలేదు, వాటిని మీరు ముందు పేజీలలో చదివే ఇక్కడకొచ్చుంటారు. అవును నేనాయనను ఎస్పీబి అనే అంటాను. ఒక తెలుగువాడిగా తమిళనాడులో వుంటూ మన తెలుగువాడైన ఎస్పీబీ ఇక్కడ మకుటంలేని మహారాజుగా మన్ననలందడం మనకు గర్వకారణం. ఇళయరాజ – ఎస్పీబి కలిసి ఒక ఇరవైఏళ్ళు సినీ సంగీత అభిమానులను ఉర్రూతలూగించిన కాలాన్ని చూసిన వాడిని. ఆ కాలం నాలాంటి అభిమానులకు స్వర్ణయుగం. క్యాసెట్ విడుదలైన రోజునే కొనేవాడిని, ఇక కారులో కూర్చుంటే ఆ పాటలే, కొన్ని క్యాసెట్లు టేప్ చుట్టుకుపోతే మరొకటి వెంటనే కొన్న సందర్భాలు బోలెడు. అది అభిమానమనండి, పిచ్చనండి, వెర్రనండి అలాటి అభిమానిని. సినిమాలు చూడడమే కాదు, ఎస్పీబి మ్యూసిక్ షోస్‌కి వెళ్ళేవాడిని.

మేము తీసిన సినిమాలన్నిటికీ మేల్ వాయిస్ ఎస్పీబీ గారిదే, ఫీమేల్ వాయిస్ సుశీల, జానకి, వాణి జయరాంగార్లు పాడారు. అదీ మా అభిమానం. నాన్నగారు తీసిన అన్ని సినిమాలకు ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరించినా ఎక్కువగా టెక్నీషియన్లతోనే వుండేవాడిని, నటీనటులతో కాస్త దూరంగానే వుండేవాడిని. దానికి కాస్త బిడియం కుడా కారణం. కాని ఎందుకో మా ఐదు సినిమాలలో ఎస్పీబీ పాడినా ఆయనతో నాకు ప్రత్యక్షంగా పరిచయం చేసుకోలేకపోయాను. కనీసం నిలబడి ఒక ఫొటో అయినా తీసుకోలేకపోయాను. నాకింకా మా మొదటి చిత్రం తాలుకు జ్ఞాపకాలు మదిలో అలాగే వున్నాయి. అమరగీతం మొదటి సినిమా, ఆ చిత్రం తమిళంలో పయనంగళ్ ముడివదిల్లై పేరుతో విడుదలయ్యి ఒక సంవత్సరం విజయవంతంగా ప్రదర్శింపబడింది. సంగీతం ఇళయరాజా, మొత్తం ఏడు పాటలు, అన్నీ సూపర్ హిట్. ఆ సినిమా తెలుగు పాటల రికార్డింగ్ విజయా గార్డెన్స్‌లో జరిగింది. అనువాద చిత్రం కాబట్టి మ్యూజిక్ ట్రాక్‌కు వాయిస్ మిక్సింగ్, ఏడు పాటలు కాబట్టి మేము రెండు రోజులు మద్యాహ్నం 2–9 కాల్షీట్ బుక్ చేశాం, మొదటి రోజు ఎస్పీబీ నాలుగు గంటలకొచ్చి ఆలస్యమైనందువల్ల తిన్నగా సింగర్స్ గదిలోకెళ్ళి పోయారు, వీటూరిగారి దగ్గిర లిరిక్ తీసుకుని చక్కగా చకచకా ఏడు పాటలలో ఆయన నాలుగు సోలో పాటలు తొమ్మిదింటిలోపు ముగించేసి, మరుసటి రోజు కాంబినేషన్‌లో వచ్చే మూడు పాటలు పాడి వెళ్ళిపోయారు, ఆ రోజు ఆయన్ను కలవలేక పోయాను, అప్పట్లో ఆయన రోజుకి ఏడు ఎనిమిది పాటలు పాడేవారు, ఒకే రోజు ఇద్దరు ముగ్గురు మ్యూజిక్ డైరక్టర్లు, రెండు మూడు రికార్డింగ్ దియేటర్లకు వెళుతూ వుండేవారు. తరువాత నాలుగు సినిమాలలో కుడా నేనాయన్ని కలవలేకపోయాను, వినడానికే వింతగా వుంది కదా, కాని నిజం.

అలా అభిమానిగానే వుండిపోయా, చాలా సందర్భాలొచ్చినా ఎందుకో కలయిక కుదరలేదు. ఆయన్ను చూడకుండా ఆయన గొంతునే మాత్రమే విన్న నాలాంటి అభిమానులకు ఆయన చిరంజీవి, అవును ఈ సినీ సంగీత సామ్రాజ్యంలో ఆయన కీర్తి ఆ చంద్రార్కం నిలిచి వుంటుంది, ఆయన వంటి వారు ఇంతకు ముందు లేరు, ఇకపై రారు, అదే ఎస్పీబీ స్థానం. అశేష అభిమానుల గుండెల్లో కొలువైన భారత రత్నం ఎస్పీబి. ●




అశేష అభిమానుల
గుండెల్లో కొలువైన
భారతరత్నం

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
October 2020

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

